Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

http://Epepar.telanganaveena.com | శనివారం మే 17 2025 | సంపుటి:2 | సంచి 229 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-




# డిఫెన్స్‌కు మరో 50 వేల కోట్లు..!



## ఆపరేషన్ సిందూర్‌తో పెరగనున్న రక్షణ బడ్జెట్

- మరో 50వేల కోట్లు కేటాయించనున్న కేంద్రం
- తాజా కేటాయింపులపై సన్నాహాలు?
- మొత్తం రక్షణ శాఖ బడ్జెట్ ఏకంగా 7 లక్షల కోట్లు



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణరంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు- సమాచారం. ఆ రంగానికి రూ.50,000 కోట్ల మేర బడ్జెట్ లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా సన్నాహాలు చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించే అవకాశాలున్నాయి. దాంతో రక్షణశాఖకు కేటాయించిన నిధులు రూ.7 లక్షల కోట్లు- దాటుతాయని

-మిగతా 2 లో



# ఇప్పటి వరకు ట్రైలర్ మాత్రమే చూపాం

- అసలు సినిమా చూస్తామంటే చూపిస్తాం
- ఉగ్రవాదాన్ని ఆపకపోతే తడాఖా చూపుతాం
- మరోమారు పాక్‌కు రాజ్‌నాథ్ ఘాటు హెచ్చరిక
- భుజ్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన రక్షణ మంత్రి


**తెలంగాణవీణ, భుజ్,**

దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాక్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆపరేషన్ సిందూర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు చూసిందంతా ఓ ట్రైలర్ మాత్రమేనని అన్నారు. శుక్రవారం భుజ్ ఎయిర్‌బేస్‌లో రాజ్‌నాథ్

-మిగతా 2 లో

# ఆపరేషన్ సిందూర్ తో భారత్ శక్తి చాటాం

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ, తెలంగాణవీణ,**

ఇటీవలి ఆపరేషన్ సిందూర్ భారతదేశపు త్రివిధ దళాల శక్తి సంపన్నతను ప్రపంచానికి చాటి చెప్పిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ప్రధాని మోడీ స్థిరమైన రాజకీయ సంకల్పం, మరోవైపు పలు కీలక సంస్థల నిర్దిష్ట ఇంటలిజెన్స్ సమాచార క్రోడీకరణ, దేశ సాయుధ బలగాల పోరాట పటిమ, ఈ మూడు అంశాలు భారత్ అంటే ఏమిటీ,మన శక్తి ఏ పాటిది? అనే కీలక

-మిగతా 2 లో


# రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

## వచ్చే మూడేళ్లలో మరింతగా పెరిగే ఛాన్స్



- డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తికి లక్ష్యం
- ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్‌పై దృష్టి
- ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్
- స్మార్ట్ పోల్స్ వినియోగంపై దృష్టి సారించాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ స్పష్టీకరణ





**తెలంగాణవీణ,హైదరాబాద్,**

వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సబ్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. విద్యుత్‌శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.

-మిగతా 2 లో



# ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

- రైతులు దిగులు చెందాల్సిన పనిలేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

**తెలంగాణవీణ, రాజన్న సిరిసిల్ల,**

తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎక్కడైనా ఏదైనా మస్య ఉంటే తెలియచేయాలని అన్నారు. జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్, వరి ధాన్యం

-మిగతా 2 లో

# కమిషన్లతో నడిచింది కేసీఆర్ ప్రభుత్వమే



- అధికారం పోవడంతో దిక్కుతోచని కేటీఆర్
- మండిపడ్డ మంత్రి సీతక్క

**తెలంగాణవీణ, హైదరాబాద్,**

కమిషన్లతో నడిచిన ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీది అని మంత్రి సీతక్క ఆరోపించారు. కేటీఆర్ కు అధికారం పోయాక పిచ్చోడు అయిపోయాడని ఆమె మండిపడ్డారు. శుక్రవారం నాడిక్కడ ఆమె మాట్లాడుతూ.. చెల్లి కవిత రేపో మాపో రాజీనామా చేస్తదని తెలుస్తుందని

-మిగతా 2 లో



# ముగిసిన కాళేశ్వరం కమిషన్ విచారణ

## ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు కసరత్తు

**తెలంగాణవీణ, హైదరాబాద్,**

కాళేశ్వరంపై విచారణ చేస్తున్న కమిషన్ తన విచారణ పక్రియను పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి అందించాల్సిన నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ ఇప్పటికే సిద్ధం చేస్తున్నారు. నివేదికకు తుది మెరుగులు దిద్ది ఈనెల మూడో వారంలో రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించనుంది.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గతేడాది నుంచి విచారణ చేస్తోంది.

-మిగతా 2 లో

# కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

- రెండోరోజు పుణ్యస్నానం ఆచరించిన భట్టి దంపతులు



**తెలంగాణవీణ, కాళేశ్వరం,**

కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు శుక్రవారం సరస్వతి పుష్కరాలల్లో పుణ్యస్నానం చేశారు. పుష్కరాలకు వెళ్లిన భట్టి దంపతులకు వేద పండితులు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంఘమంలో భట్టి దంపతులు పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత సరస్వతి మాత నదికి ప్రత్యేక పూజలు చేసి పట్టు చీరతో సారే అప్పజేప్పారు. భట్టి సరస్వతి

-మిగతా 2 లో

# రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

(మొదటి తరువాయి)

భవిష్యత్‌లో డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ మారబోతోంది. విద్యుత్ లైన్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలి. ఫ్యూచర్‌సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ విద్యుత్ టవర్లు, లైన్లు, స్తంభాలు కనిపించకూడదు. గ్రేటర్ పరిధిలో స్మార్ట్‌పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఓఆర్ఆర్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినట్లు-అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26లో విద్యుత్ డిమాండ్ 18,138 మెగావాట్లకు పెరుగుతుందని, 2034-35 నాటికి విద్యుత్ డిమాండ్ 31,808 మెగావాట్లకు చేరుతుందని అధికారులు వివరించారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎంకి అధికారులు వివరించారు. గత ఏడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగింది అన్నారు. 2025-26లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగు తుందని అంచనా వేశారు. 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు- ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది అన్నారు. విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి.. రైల్వే లైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్ పోర్టులకు విద్యుత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు- ఇతర కార్పొరేషన్లలో విద్యుత్ అవసరాలను లెక్కలోకి తీసుకోవాలి.. కొత్తగా ఏర్పాటు- చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ ను దృష్టిలో పెట్టు-కుని ముందుకు కొనసాగాలని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్ గా మారబోతుంది.. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలన్నారు.

## ఆపరేషన్ సిందూర్ తో భారత్ శక్తి చాటాం

(మొదటి తరువాయి)

విషయాలను వెల్లడించిందని వివరించారు. దేశ రాజధానిలో శుక్రవారం అధునాతన మల్టి ఏజెన్సీ సెంటర్ ప్రారంభం తరువాతి సభలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు ఇంటలిజెన్స్ సమాచార సేకరణ , పలు సంస్థల మధ్య పంపిణీ, సముచిత సమన్వయం నిర్వహణకు ఈ కీలక కేంద్రం ఏర్పాటు- జరిగింది. ఓ ధృఢమైన నాయకత్వం, గురి తప్పని సమాచార సేకరణ, నిరుపమాన దాడుల శక్తియుక్తులు ఇప్పుడు దేశాన్ని మరింత శక్తివంతం చేశాయని అమిత్ షా ఈ సందర్భంగా తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత చోటు-చేసుకున్న మన అత్యంత కీలకమైన ఆపరేషన్ సిదూర ప్రధాని మోడీ చెక్కుచెదరని రాజకీయ చిత్తశుద్ధికి, మొక్కవోని ధక్షతకు నిదర్శనం అయిందని పేర్కొన్నారు. ఇక్కడ ప్రారంభం అయిన మల్టీ ఏజెన్సీ సెంటర్ దేశ ఇంటలిజెన్స్ బ్యూరో పరిధిలో పనిచేస్తుంది. 26/11 ముంబై దాడుల తరువాతి క్రమంలో దేశంలో పలు స్థాయిల నిఘా సమాచార వ్యవస్థల మధ్య సత్వర సమగ్ర రీతి సమన్వయానికి ఈ మల్టీ ఏజెన్సీ సెంటర్ ఏర్పాటు- జరిగింది. సకాలంలో సమాచారం సేకరించడం తరువాతి క్రమంలో పలు సంస్థల సమన్వయంతో తీసుకోవల్సిన చర్యల గురించి ఆలోచించి తాత్సారం లేకుండా స్పందించడం ఈ ఏజెన్సీ ముఖ్య ఉద్దేశం అన్నారు.

## కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

(మొదటి తరువాయి)

నది హారతి కార్యక్రమంలో పాల్గొని వీక్షించారు. భట్టి పర్యటన నేపధ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. గురువారంనుంచి సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద పవిత్ర సరస్వతి పుష్కర మహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సీఎంకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి నదిలో మంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి పుణ్యస్నానమాచరించారు. తర్వాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించి.. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఈ నెల 15 నుంచి 26 వ తేదీ వరకు 12 రోజులపాటు- సరస్వతీనది పుష్కరాలు వైభవంగ జరుగనున్నాయి . ఈ సమయంలో సరస్వతి నదితీరంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తారు. ఏ నదిలో పుష్కరాలు జరుగుతున్నాయో ఆ నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే పాపాల నుంచి విముక్తి కలుగుతుందని పండితులు చెబుతున్నారు. ప్రస్తుతం సరస్వతి నది పుష్కరాలకు సిద్దమవుతుంది. తెలంగాణలోని కాళేశ్వరంలో సరస్వతినదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు సిద్దమవుతున్నారు. ఈ పుష్కరాలు కాళేశ్వరం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను పెంచుతుంది. టెంపుల్ టూరిజంపై తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తిని కూడా ప్రతిబింబించే అవకాశం ఉంది. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు- చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. లతెలంగాణా రాష్ట్రంలోని కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలోను సరస్వతీ నదీ పుష్కరాలు జరుగుతాయి.

## కార్గో షిప్‌లో పాక్ జాతీయుడు..

### భారత్‌లోకి ప్రవేశం నిరాకరణ

బెంగళూరు



భారత పోర్ట్‌కు చేరుకున్న విదేశీ కార్గో షిప్‌లో పాకిస్థాన్ జాతీయుడు ఉన్నాడు. దీంతో పోర్టు అధికారులు అప్రమత్తమయ్యారు. భారత్‌లోకి అతడి ప్రవేశాన్ని నిరాకరాంచారు. పోర్టులోకి అడుగుపెట్టకుండా నిరోధించారు. మే 12న ఇరాక్‌కు చెందిన ఎంటీఆర్ ఓషన్ అనే కార్గో షిష్ బిటుమెన్ లోడ్‌తో కర్ణాటకలోని కార్వార్ పోర్టుకు చేరుకున్నది. అందులో షిప్ కెప్టెన్‌తో సహా 14 మంది భారతీయులు, ఇద్దరు సిరియన్లు, ఒక పాకిస్థాన్ జాతీయ సిబ్బంది ఉన్నారు.కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ జాతీయులకు భారత్‌లోకి ప్రవేశాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. వారి వీసాలను కూడా రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఇరాక్ కార్గో నౌకలో పాకిస్థాన్ జాతీయుడు ఉన్నట్లు తెలుసుకుని కార్వార్ పోర్టు పోలీసులు, అధికారులు అలెర్ట్ అయ్యారు. ఆ కార్గో షిప్‌లోకి వారు వెళ్లారు.

## ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

(మొదటి తరువాయి)

కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు- పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయండి అని సూచించారు. కానీ, రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.. పంట ఎండి పోయిందనే అవకాశం లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నాం అన్నారు. ఎందుకంటే, మాది రైతుల ప్రభుత్వం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

## కమిషన్లతో నడిచింది కేసీఆర్ ప్రభుత్వమే

(మొదటి తరువాయి)

అన్నారు. కమిషన్లకి కక్కుర్తి పడ్డది కేటీఆర్.. బీఆర్ఎస్ కమిషన్ల ప్రభుత్వం అన్నారు. కన్నీళ్లు తుడిచే ప్రభుత్వం మాది అని ఆమె అన్నారు. ఇక, సుందరిమణుల్లో ఒకరికో ఒక్క అమ్మాయి అలా చేస్తే దాన్ని ప్రభుత్వానికి అంట గట్టడం అవివేకం, దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేటీఆర్ అబద్ధాలు చెప్పి కాలం వెల్లదిస్తున్నారు..గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో భూములు మారిపోయాయని మంత్రి సీతక్క ఆరోపించారు. అయితే, ధరణిలో మోఖ మీద ఉన్న రైతులకు కాకుండా వేరే వాళ్ళకి భూములు పట్టాలు చేశారని సీతక్క అన్నారు. భూమి న్యాయంగా ఎవ్వరికి దక్కాలో వారికే దక్కేందుకు తీసుకొచ్చిందే భూ భారతి లక్ష్యం.. భూ స్వాములకు తిరిగి భూములు తీసుకోవడం కోసం ధరణి పని చేసింది.. జూన్ 2వ తేదీ నుంచి రైతుల కనీళ్లు తుడిచేది భూ భారతి అమలు చేస్తున్నాం.. ఇక, రాజకీయ జోక్యం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు.. ఐటిడిఎల పరిధిలో ఉన్న వాళ్ళకు స్పెషల్ గా ఇండ్లు ఇస్తాం.. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసమే ఇందిరమ్మ ఇండ్లు.. ప్రజా ప్రతినిధులు అర్హత లేని వారు ఉంటే చెప్పండి తొలగించడానికి మేము సిద్ధంగా ఉన్నామని మంత్రి అన్నారు. ఈ లిస్టులో రాకపోతే తరువాత వచ్చే లిస్టులో ఉంటదని మంత్రి సీతక్క వెల్లడించింది. ఇక, భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా రెండో విడత పెంచికల్ పెట్ లో నిర్వహించడం జరుగుతుందని మంత్రి సీతక్క అన్నారు. 12 ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న చిక్కు ముడులను తీయడానికి భూ భారతి చట్టం తీసుకొచ్చాం.. కాస్తూ కాలం తీసేయడంతో రైతులు ఆత్మహత్యలు, అధికారులపై దాడులు జరిగాయి.. కేసీఆర్ మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాహుల్ గాంధీ కూడా ధరణిని తీసేస్తామని అన్నారు.. రైతు హక్కులు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.. పోడు చేస్తున్న రైతులకు గిరి వికాసం క్రింద సోలార్ ను అందించి భూమి సస్యశ్యామలం చేయాలని కోరారు.. ప్రతి నియోజకవర్గంలో3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం.. ఐటిడిఎ నుంచి కూడా ఆదివాసులకు అందించేందుకు చర్యలు చేపట్టాం.. ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు రైతులకు సహకరించాలి, ఎలాటి ఇబ్బందులు పెటటొదని పేర్కొన్నారు. కొత్త అడవిని కొట్టవద్దు. దాని కోసం అవగాహన కల్పిస్తామని సీతక్క చెప్పుకొచ్చారు.

# డిఫెన్స్ కు మరో 50 వేల కోట్లు

(మొదటి తరువాయి)

ఆ వర్గాలు తెలిపాయి. ఇండియన్ ఆర్మీ వరుస విజయాలు సాధించిన నేపథ్యంలో.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ శాఖకు మరో 50 వేల కోట్ల రూపాయల నిధుల్ని కేటాయించాలని భావిస్తున్నట్లు- తెలుస్తోంది. పహల్గామ్ దాడి తర్వాత భారత్ ఏ విధంగా స్పందిస్తుందా.. అని ప్రతీ భారత పౌరుడితో పాటు ప్రపంచం మొత్తం ఎంతో ఆత్రుతగా ఎదురు చూసింది. ఎవ్వరూ ఊహించని విధంగా ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి మరీ ఇండియన్ ఆర్మీ ఉగ్రవాదులపై దాడులు చేసింది. వంద మంది ఉగ్రవాదులు ఈ దాడుల్లో చనిపోయారు. తర్వాత రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధంలో కూడా భారత్ తన సత్తా ఏంటో చూపించింది. పాకిస్తాన్‌లోని ఏయిర్‌బేస్‌లు, ఆర్మీ పోస్టులను ధ్వంసం చేసింది. 2025.. 2026 సంవత్సరానికి గాను భారత ప్రభుత్వం రక్షణ శాఖకు 6.81 లక్షల కోట్లను కేటాయించింది. గత సంవత్సరం కంటే ఇది చాలా ఎక్కువ. 2024..2025 సంవత్సరానికి గానూ కేంద్రం 6.22 కోట్లను కేటాయించింది. 2025..2026 సంవత్సరానికి ఆ నిధుల్ని 9.2 శాతం పెంచేసింది. వచ్చే బడ్జెట్.. అంటే 2026, 2027 సంవత్సరానికి గాను 6.81 లక్షల కోట్లకు మరో 50 వేల కోట్లు వచ్చి చేరే అవకాశం ఉంది. మొత్తంగా రక్షణ శాఖ బడ్జెట్ ఏకంగా 7 లక్షల కోట్లకు పైకే చేరుతుంది. ఇందుకు సంబంధించిన ఫైల్ వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందనుంది. ఏడు లక్షల కోట్ల బడ్జెట్ మొత్తాన్ని రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఆయుధాల కొనుగోళ్లు, ఇతర అవసరమైన వస్తువుల కొనుగోలుకు వాడనున్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రక్షణ శాఖపై ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే ఏకంగా రూ. 2.29 లక్షల కోట్లను కేటాయించారు. చైనా, పాకిస్థాన్ నుంచి భద్రతా సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో రక్షణరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులను ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. రూ.50వేల కోట్ల అనుబంధ బడ్జెట్‌లో నిధులను పరిశోధన, ఆయుధాలు, అవసరమైన పరికరాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశాలున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో డిఫెన్స్ కేటాయింపులు రూ.2.29 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం వార్షిక పద్దులో 13 శాతం రక్షణకే కేటాయించారు.

# ఇప్పటి వరకు ట్రైలర్ మాత్రమే చూపాం

(మొదటి తరువాయి)

పర్యటించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ అధికారులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ.. ' ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. ఇప్పటి వరకు చూసిందంతా ట్రైలర్ మాత్రమే. సరైన సమయం వచ్చినపుడు ప్రపంచం మొత్తానికి పూర్తి సినిమా చూపిస్తాం. పాకిస్తాన్‌ను ఇప్పుడు ప్రొబేషన్ పీరియడ్‌లో పెట్టాము. పాక్ తన బుద్ధి మార్చుకుంటే పర్లేదు. లేకపోతే కఠినమైన శిక్షలు వేస్తాం' అని అన్నారు. ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయిర్‌ఫోర్స్ అధికారుల పని తీరును పొగడటానికి తనకు మాటలు సరిపోవటం లేదన్నారు. యావత్ దేశం తరపునుంచి మరోసారి ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాకిస్తాన్ గడ్డమీద ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను మీరు ఎలా ధ్వంసం చేశారో ప్రపంచం మొత్తం చూసింది. తర్వాత కూడా వారి ఏయిర్‌బేస్‌లను ధ్వంసం చేశారు. భారత్ యుద్ధ నియమాలు, టెక్నాలజీ మారిందని ప్రపంచానికి మీరు చాటి చెప్పారు. ధైర్య, సాహసాలకు ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ ప్రతీకగా నిలిచింది. ఏయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌కు నా కృతజ్ఞతలు. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు' అంటూ పొగడ్తల వర్షం కురిపించారు.గురువారం జమ్మూకాశ్మీర్ పర్యటనలో భాగంగా పాకిస్తాన్‌పై ఫైర్ అయ్యారు. పాకిస్తాన్ దగ్గర ఉన్న అణు బాంబులను లాక్కోవాలని ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశారు. పాకిస్థాన్ ఎన్నోఏళ్లుగా పెంచి..పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచిపెట్టేసిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం పాక్ చర్యలను భారత్ పరిశీలిస్తుందని.. తేడా వస్తే చర్యలు మరింత కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గుజరాత్‌లోని భుజ్ వైమానిక దళ సైనికులతో సమావేశమైన కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి వచ్చిన నిధులలో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలో ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తుందన్నారు. అప్పు చేసి మరీ దాయాది దేశం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్ల ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని రాజ్‌నాథ్ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టు-కొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని కోరారు. భవిష్యత్తులోనూ ఆ దేశానికి ఎలాంటి సహాయం అందించొద్దని కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు భారత్ అర్థరాత్రి ఉదయపు వెలుగు ఎలా ఉంటు-ందో చూపించిందని.. మన సైనికుల పరాక్రమం చూసి దేశ, విదేశాల్లోని భారతీయులు గర్విస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ఈ ఆపరేషన్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. మన బ్రహ్మోస్ క్షిపణి శక్తిని దాయాది దేశం కూడా అంగీకరించిందని పేర్కొన్నారు.

## ముగిసిన కాళేశ్వరం కమిషన్ విచారణ

(మొదటి తరువాయి)

బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై కమిషన్ విచారణ జరిపింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను విచారించింది. వారి నుంచి అఫిడవిట్లు తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. కాగ్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలను కూడా కమిషన్ పరిశీలించింది. అన్ని అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకొంది. గత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ను కూడా విచారణకు పిలవాలని కమిషన్ మొదట భావించింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వారిని విచారణకు పిలవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయానికి కమిషన్ వచ్చినట్టు సమాచారం.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# మిత్ర దేశాల్లో పాకిస్థాన్ బిచ్చగాళ్లు..

**-ఏకంగా 5033 మందిని వెళ్లగొట్టిన సౌదీ**



**తెలంగాణవీణ,** తాము ఏ మిత్ర దేశానికి వెళ్లినా అడుక్కోవడానికే వచ్చామన్నట్లు చూస్తారని మూడేళ్ల క్రితం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఓ సమావేశంలో అన్నారు. ఆయన ఏ ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేశారో గానీ, మిత్ర దేశాలను మాత్రం పాకిస్థాన్ బిచ్చగాళ్లు హడలెత్తిస్తున్నారు. కొందరు పాకిస్థానీలు యాత్రికుల వీసాలను తీసుకుని వెళ్లి మరీ మిత్ర దేశాల్లో భిక్షాటన చేస్తున్నారు. ఫలితంగా యాచకులను ఎగుమతి చేసే దేశంగా పాకిస్థాన్ అపకీర్తిని మూటగట్టుకుంది. ఈ క్రమంలో సౌదీ అరేబియా తాజాగా తమ దేశంలో ఉన్న పాకిస్థానీ బిచ్చగాళ్లను స్వదేశానికి పంపుతోంది. ఇప్పటివరకు ఏకంగా 5033 మంది బిచ్చగాళ్లను బలవంతంగా పాకిస్థాన్‌కు వెళ్లగొట్టింది. పాకిస్థాన్ మిగతా మిత్రదేశాలు కూడా సౌదీ బాటనే అనుసరిస్తున్నారు. ఆయా దేశాలు కూడా 369 మంది పాకిస్థానీ బిచ్చగాళ్లను స్వదేశానికి పంపించాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ ఇంటీరియర్ మంత్రి మొహసిన్ నక్వీ ఇటీవల ఆ దేశపు నేషనల్ అసెంబ్లీలో వెల్లడించారని డాన్ పత్రిక తన కథనంలో పేర్కొంది. అంటే 2024 జనవరి నుంచి మిత్ర దేశాలు తరిమేసిన పాకిస్థాన్ బిచ్చగాళ్ల సంఖ్య 5,402. బిచ్చగాళ్లను వెళ్లగొట్టిన పాకిస్థాన్ మిత్రదేశాల్లో సౌదీతోపాటు.. ఇరాక్, మలేసియా, ఒమన్, ఖతార్, యూఏఈ ఉన్నాయి. తిరిగొచ్చిన పాకిస్థాన్ బిచ్చగాళ్లలో సింధి ప్రావిన్స్‌కు చెందినవాళ్లు 2,795 మంది, పంజాబ్ ప్రావిన్స్ నుంచి 1,437 మంది, ఖైబర్ ఫక్తుంక్వా నుంచి 1,002 మంది, బలోచిస్థాన్ నుంచి 125 మంది, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ నుంచి 33 మంది, ఇస్లామాబాద్ నుంచి 10 మంది ఉన్నారు. కాగా పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ ఏప్రిల్ 19న సియాల్‌కోట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. దేశంలో యాచన ఓ పెద్ద సమస్యగా మారిందన్నారు. దీనివల్ల ఇతర దేశాలు వీసాలు జారీ చేయడంలేదని చెప్పారు. దేశంలో దాదాపు 2 కోట్ల మంది యాచకులు ఉన్నట్లు తెలిపారు. వారి నెలవారీ ఆదాయం 4,200 కోట్ల పాకిస్థానీ రూపాయిలని ఆయన వెల్లడించారు. సియాల్ కోట్ నుంచి వారిని రెండుసార్లు తరిమేస్తే మళ్లీ తిరిగొచ్చారన్నారు. అదేవిధంగా 2023లో పాకిస్థాన్ సెనెట్ ప్యానెల్ ముందు నాటి ఓవర్సీస్ మినిస్ట్రీ సెక్రెటరీ జుల్ఫికర్ హైదర్ మాట్లాడుతూ.. విదేశాల్లో అరెస్టవుతున్న 90 శాతం బిచ్చగాళ్లు పాకిస్థాన్‌కు చెందినవారని అన్నారు. చాలామంది యాత్రికుల వీసాలను తీసుకొని సౌదీ, ఇరాన్, ఇరాక్ లాంటి దేశాలకు వెళ్తున్నారని, అక్కడ భిక్షాటన చేస్తూ గడుపుతున్నారని చెప్పారు. వారికి ఇప్పుడు జపాన్ కొత్త కేంద్రంగా మారుతోందని తెలిపారు.

# గాజాలో మారణహోమం


**ఇజ్రాయెల్ దాడుల్లో 64 మంది మృతి**



**తెలంగాణవీణ, గాజా** గాజా లో ఇజ్రాయెల్ మారణహోమాన్ని సృష్టిస్తోంది. వరుసగా మూడోరోజు భీకర దాడులకు పాల్పడింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. డీర్ అల్-బాలా, ఖాన్ యూనిస్ నగర శివారుల్లో ఇజ్రాయెల్ దళాలు భీకర దాడులకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో 64 మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. 48 మృతదేహాలను ఇండోనేషియా ఆసుపత్రికి తరలించగా.. మరో 16 మృతదేహాలను నాజర్ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఈ దాడుల్లో వంద మందికిపైగా గాయపడినట్లు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా పర్యటనలో ఉండగా.. ఐడీఎఫ్ దళాలు గాజాపై వరుస దాడులకు పాల్పడుతుండటం గమనార్హం. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేయడం ఇది వరుసగా మూడోరోజు. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై బుధ-గురువారాల మధ్య రాత్రి ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో 54 మంది మరణించారు. మృతుల్లో ఓ పాత్రికేయుని కుటుంబ సభ్యుల్లో 11 మంది కూడా ఉన్నారు. అంతకు ముందు మంగళవారం రాత్రి బుధవారం తెల్లవారుజామున మధ్య జరిగిన దాడుల్లో 22 మంది చిన్నారులు సహా మొత్తం 70 మంది ప్రాణాలు కోల్పోయారు. ఫలితంగా గత మూడు రోజుల వ్యవధిలోనే ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గాజాలో 180 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవలే మాట్లాడుతూ.. గాజాలో యుద్ధాని ఆపడానికి ఎలాంటి మార్గం లేదని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. హమాస్ ఉగ్రవాద సంస్థను అంతం చేసే వరకు గాజా స్ట్రిప్‌లో యుద్ధం కొనసాగుతుందన్నారు. దీంతో కాల్పుల విరమణపై అవకాశాలు సన్నగిల్లాయి.

# మళ్లీ కోరలు చాస్తున్న కరోనా మహమ్మారి..

**ఆ దేశాల్లో హై అలర్ట్**




**తెలంగాణవీణ, హాంకాంగ్** ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి ఇప్పుడు మళ్లీ కోరలు చాస్తోంది. ఆసియాలోని రెండు దేశాల్లో భారీగా కొవిడ్ కొత్త కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆయా దేశాల్లో ఆరోగ్య శాఖ అధికారులు హై అలర్ట్ అయ్యారు ఆసియా దేశాల్లో కరోనా కేసుల్లో భారీ పెరుగుదల నమోదైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. ముఖ్యంగా అధిక జనసాంద్రత కలిగిన హాంకాంగ్ , సింగపూర్ దేశాల్లో కేసులు గణనీయంగా పెరుగుతున్నట్లు వెల్లడించారు. హాంకాంగ్‌లో వైరస్ వ్యాప్తి అధికంగా ఉందని స్థానిక అధికారి ఒకరు హెచ్చరించారు. ఇటీవల శాంపిల్స్‌లో అనేకం పాజిటివ్‌గా తేలాయని తెలిపారు. ఈ ఏడాది ఈ స్థాయిలో కరోనా పాజిటివ్‌గా తేలడం ఇదే తొలిసారని అన్నారు. మే 3తో ముగిసిన వారంలో 31 కొవిడ్ మరణాలు నమోదైనట్లు చెప్పారు. ఈ ఏడాది ఇదే గరిష్ఠ సంఖ్య అని కూడా తెలిపారు. రెండేళ్ల నాటి కొవిడ్ ఇన్ఫెక్షన్ దశతో పోలిస్తే కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ పరీక్షల్లో వైరల్ లోడ్ పెరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. అటు సింగపూర్ కూడా కొవిడ్ కేసుల పెరుగుదలతో అలర్ట్ అయింది. దాదాపు ఏడాది తర్వాత ఈ నెలలో కొవిడ్ కేసుల సంఖ్యపై సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ.. నివేదికను విడుదల చేసింది. మే 3వ తేదీ నాటికి అంచనా వేసిన కేసుల సంఖ్య కంటే 28 శాతం పెరిగి పాజిటివ్ కేసుల సంఖ్య 14,200కు చేరుకున్నట్లు తెలుస్తోంది. నిత్యం ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య కూడా దాదాపు 30 శాతం పెరిగినట్లు సమాచారం. థాయ్‌లాండ్, చైనా దేశాల్లోనూ కొవిడ్ కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నట్లు తెలుస్తోంది. జనాభాలో తగ్గుతున్న ఇమ్యూనిటీ కారణంగా కేసుల సంఖ్య పెరుగుతూ ఉండొచ్చని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. కేసుల పెరుగుదలతో ఆయా దేశాల అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని సూచించారు.

# జమ్మూకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లు

**- ఆరుగురు ఉగ్రవాదులు మృతి**

**తెలంగాణవీణ, శ్రీనగర్** జమ్మూకాశ్మీర్‌లో గత మూడు రోజుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లల్లో ఆరుగురు ఉగ్రవాదులు మరణించినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. విలేకరుల సమావేశంలో కాశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) వికె బిర్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని తెలిపారు. దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని అవంతిపొరాలో విక్టర్ ఫోర్స్ ప్రధాన కార్యాలయంలో విక్టర్ ఫోర్స్ కమాండింగ్ జనరల్ ఆఫీసర్ మేజర్ జనరల్ ధనంజరు జోషితో కలిసి ఐజిపి విలేకరులతో మాట్లాడారు. భద్రతా సంస్థల మధ్య సమన్వయం కారణంగా రెండు విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించినట్లు చెప్పారు. మంగళవారం షోపియన్ జిల్లాలోని కెల్లర్ ప్రాంతంలోనూ, గురువారం పుల్వామాలోని త్రాల్‌లోని నాదర్ ప్రాంతంలోనూ ఈ రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయని తెలిపారు. రెండు ఆపరేషన్లలోనూ ముగ్గురేసి చొప్పున ఉగ్రవాదులు మరణించారని చెప్పారు. జమ్మూకాశ్మీర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సమన్వయంతో ఆ ఆపరేషన్లు నిర్వహించినట్లు వి.కె.బిర్డి తెలిపారు. కాశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో ఈప్రాంతంలో మోహరించిన అన్ని భద్రతా దళాలు తమ వ్యూహాలను సమీక్షించాయని అన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి కట్టుబడి ఉన్నామని మేజర్ జనరల్ జోషి పేర్కొన్నారు. మంచు కరగడం వల్ల ఉగ్రవాదలు ఎత్తైన ప్రాంతాలకు తరలివెళ్లారని తమకు నిఘా సమాచారం అందిందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ బృందాలు నిరంతరం ఎత్తైన ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు, అడవుల్లో మోహరించాయని జోషి తెలిపారు. మృతి చెందిన ఆరుగురు ఉగ్రవాదుల్లో ప్రధాన వ్యక్తి షాహిద్ కుట్టారు అని, ఇతను కొన్ని భారీ దాడుల్లో పాల్గొన్నాడని చెప్పారు. ఇందులో ఒక సర్పంచ్‌పై దాడి, ఒక డానిష్ రిసార్ట్‌లో కాల్పుల సంఘటన వంటివి ఉన్నాయని చెప్పారు.

# తుర్కియే, చైనా ను వణికించిన భూకంపం



**తెలంగాణవీణ,చైనా** చైనా లో భూకంపం సంభవించింది. యునాన్ ప్రావిన్స్ లో శుక్రవారం ఉదయం 6:30 గంటలకు భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. అయితే, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మరోవైపు శుక్రవారం తెల్లవారుజామున ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై దీని తీవ్రత 4గా నమోదైనట్లు ఎన్‌సీఎస్ వెల్లడించింది.గురువారం రాత్రి తుర్కియేలోనూ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. కొన్యా ప్రావిన్సులోని కులు జిల్లా కేంద్రానికి 14 కి.మీ దూరంలో భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 5.2గా నమోదైంది. రాజధాని అంకారాతోపాటు సమీప నగరాల్లోనూ ప్రకంపనలు వచ్చినట్లు స్థానిక మీడియా నివేదించింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు భయంతో ఇళ్లు, ఆఫీసుల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, నష్టానికి సంబంధించి ఎటువంటి సమాచారం లేదు.

# భారత్ సామర్థ్యం ముందు చైనా, పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఎందుకూ పనికిరావు

**-అమెరికా రక్షణ నిపుణుడు**



**తెలంగాణవీణ,న్యూఢీల్లి** ఉగ్రవాదాన్ని పోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను అమెరికా రక్షణ రంగ నిపుణుడు జాన్ స్పెన్సర్ సమర్థించారు. పాక్‌పై భారత్ దాడి, రక్షణాత్మక ఆధిపత్యాన్ని ప్రదర్శించిందన్నారు. ఈ ఆపరేషన్‌తో పాకిస్థాన్‌లోని ఏ ప్రదేశంలోనైనా ఎప్పుడైనా దాడి చేయగలమన్న సందేశాన్ని దాయాదికి పంపిందన్నారు.ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడేకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జాన్ స్పెన్సర్ మాట్లాడుతూ.. భారత రక్షణ వ్యవస్థలతో పోలిస్తే చైనా, పాక్ ఎయిర్ డిఫెన్స్ చాలా బలహీనమని అభిప్రాయపడ్డారు. భారత్ సామర్థ్యం ముందు అవి ఎందుకూ పనికిరావన్నారు. 'అటు దాడికి అవసరమైన దూకుడును, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని భారత్ చూపించింది. పాక్ డ్రోన్ దాడులు, హై-స్పీడ్ క్షిపణులను ఎదుర్కోవడంతో సహా తనను తాను విజయవంతంగా రక్షించుకోవడంలో భారత్ విజయవంతమైంది. పాక్‌ను ఎప్పుడైనా, ఎక్కడైనా దెబ్బ కొట్టగలమని నిరూపించింది. భారత్‌పై దాడికి చైనా వైమానిక రక్షణ వ్యవస్థను పాక్ ఉపయోగించింది. అవి ఘోరంగా విఫలమయ్యాయి. భారత సామర్థ్యం ముందు అవి నిలువలేకపోయాయి. భారతదేశ అధునాతన సైనిక సామర్థ్యానికి బ్రహ్మోస్ క్షిపణి నిదర్శనం. చైనా, పాక్ వైమానిక రక్షణ వ్యవస్థలను బ్రహ్మోస్ ధ్వంసం చేసేసింది' అంటూ భారత్ సామర్థ్యాన్ని కీర్తించారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్‌తో గట్టి బదులు తీర్చుకున్న విషయం తెలిసిందే. దీనికి ప్రతిదాడిగా మే 10న భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇస్లామాబాద్ డ్రోన్, క్షిపణి దాడులకు యత్నించింది. దీంతో భారత్ పాక్ భూభాగంలోని 11 వైమానిక స్థావరాలపై దాడి చేసింది. ఈ దాడులకు భారత్ 'బ్రహ్మోస్' క్షిపణులను వాడింది.

GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

## సంపాదకీయం

# ముగిసిన యుద్ధం, మిగిలిన ప్రశ్నలు

మన తోబుట్టువుల, కుమార్తెల సిందూరాన్ని తుడిచివేసిన పర్యవసానమేమిటో నేడు ప్రతి ఉగ్రవాదికి, ప్రతి ఉగ్రవాద సంస్థకు తెలిసివచ్చింది. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక పేరు కాదు, కోట్లాది భారతీయుల మనోభావాలకు ప్రతిబింబం'... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోని మాటలవి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఆపరేషన్ సిందూర్‌లో ఒక విరామం మాత్రమేనని దేశ ప్రజలు విశ్వసించేలా చేసేందుకు ఆయన ప్రయత్నించారు. మోదీ స్వాభావిక వాక్చాతుర్యం, శ్రోతలను సమ్మోగ్ధం చేసే మాటకారితనం ఆ ప్రసంగంలో బాగా కనిపించాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు భారీ నష్టాన్ని కలిగించడంలో ఆపరేషన్ సిందూర్ సఫలమయిందని మోదీ అన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రాతిపదికన కొత్త లక్ష్మణ రేఖలు నిర్దేశిస్తూ పాకిస్థాన్ ప్రభుత్వంతో చర్చలు ఉగ్రవాదం, ఆక్రమిత కశ్మీర్‌పైన మాత్రమే జరుగుతాయని ప్రధానమంత్రి ప్రకటించారు. ఇస్లామాబాద్ పాలకులు అణ్వస్త్రాల బూచిని చూపుతూ పాల్పడుతున్న బ్లాక్ మెయిల్‌కు భారత్ బెదరదు, జడవదు అని, మళ్లీ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తే కఠినంగా ప్రతిస్పందించేందుకు భారత సైన్యం సదా యుద్ధ సన్నద్ధమై ఉందని నరేంద్రమోదీ హెచ్చరించారు. ఒకపక్క, ఇక్కడ, ఇలా, భారత రాజకీయాల శక్తిమంతుడు తాను పాకిస్థాన్‌ను కాళ్ళబేరానికి రప్పించాకనే కాల్పుల విరమణ జరిగిందంటూ టీవీలో ప్రసంగిస్తుండగానే అక్కడ వేలమైళ్ళ దూరంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ కథనానికి వరుస తూట్లుపొడిచాడు. తాను, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తీవ్ర ప్రయత్నాలు చేసి దక్షిణ ఆసియాలోని రెండు అణ్వస్త్ర రాజ్యాలను కాల్పుల విరమణకు ఒప్పించామని ట్రంప్ పేర్కొన్నారు.ప్రపంచ మీడియా పతాక శీర్షికల్లో ఉండేందుకు మోదీ కంటే ఎక్కువగా ట్రంప్ ఆరాటపడడం గత కొద్ది రోజుల్లో ఇది మూడోసారి. కాల్పుల విరమణకు అంగీకరించినట్టు భారత్, పాకిస్థాన్ ప్రభుత్వాలు ప్రకటించకముందే ట్రంప్ ఆ విషయాన్ని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. మరి కొద్ది గంటల్లోనే, భారత్, పాకిస్థాన్‌లకు నచ్చచెప్పేందుకు అమెరికా ప్రభుత్వం రాత్రికి రాత్రి చేసిన ప్రయత్నాల గురించి సవివరంగా ట్వీట్ చేశారు. కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానని కూడా ఆయన ప్రతిపాదించారు. మే 12న వైట్ హౌజ్‌లో మీడియా రోజువారీ గోష్ఠిలో ట్రంప్ ఆశువుగా చేసిన వ్యాఖ్యలు ఇంటా బయటా అసాధారణ వ్యక్తిలా వ్యవహరించే ప్రధాని మోదీని చిన్నబుచ్చేవిగా ఉన్నాయి. భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తామని ఉభయ దేశాల ప్రధానమంత్రులకు గద్దించి చెప్పడం ద్వారా ఈ ఘర్షణ నుంచి విరమించుకునేలా చేశామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలా ట్రంప్ తనను వెంటాడడం కొనసాగుతుండడంతో సర్వత్రా తనకు ప్రచారాన్ని, ప్రాధాన్యాన్ని పొందడంలో అనితరసాధ్యుడైన మోదీ, ఇప్పుడు ఆ విషయంలో ఇబ్బందుల్లో పడ్డారు! భారత్ పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఘర్షణలు తమ ప్రయత్నాల వల్లనే నిలిచిపోయానని అమెరికా ఘనంగా చెప్పుకున్న అంశాన్ని, కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానన్న ట్రంప్ ప్రతిపాదనను ప్రధాని మోదీ తన ప్రసంగంలో మాట మాత్రంగానైనా స్పృశించకుండా యథావిధిగా తన ఉద్వేగపూరితమైన ప్రసంగంలో ప్రజలను ముంచెత్తారు. పాకిస్థాన్ నాయకులు తమ ప్రసంగాల్లో అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలుపగా, ఆమెరికా ఉనికిని భారత్ కనీసమాత్రంగానైనా అంగీకరించలేదు. భారతీయ ఆడపడుచుల నుదుటి 'సిందూరం'ను ఉగ్రవాదులు తుడిచేశారని మోదీ తన ప్రసంగంలో పదే పదే ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను పురిగొల్పారు.అమెరికా వ్యాఖ్యలు, వాటిపై నరేంద్ర మోదీ మౌనం వహించడం ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించేందుకు వీలు కల్పించింది. ప్రధానమంత్రిని 'విశ్వగురు'గా ఆరాధిస్తున్న భారతీయ జనతా పార్టీ శ్రేణులను ఈ పరిణామం కలవరపరుస్తోంది. మోదీ తన విదేశీ పర్యటనలలోను లేదా భారత్ పర్యటనకు వచ్చిన అంతర్జాతీయ నాయకులను ప్రేమపూర్వకంగా ఆలింగనం చేసుకోవడం లేదా అభినందనపూర్వకంగా వారి వెన్నుచరచడం పరిపాటి. అలాంటిది ఇప్పుడు ట్రంప్ ఆయన్ను, పాకిస్థాన్ ప్రధానమంత్రిని సమరీతిలో గౌరవించడం, ఇరువురినీ ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాగా పేర్కొనడం ద్వారా మోదీని తీవ్ర ఇబ్బందికి లోను చేశారు. ట్రంప్ తీరుతో మోదీ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. విధేయ మీడియా, సామాజిక మాధ్యమాల శ్రేణులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ జరిగిన నష్టాన్ని భర్తీచేయడం అసాధ్యంగా ఉన్నది. ఆకస్మికంగా, అనూహ్యంగా అమలు జరిగిన కాల్పుల విరమణను యుద్ధోన్మాదులు హర్షించలేకపోయారు. యుద్ధం చుట్టూ బీజేపీ నిర్మిస్తూవచ్చిన దేశభక్తియుత, ఉద్వేగపూరిత వాతావరణాన్ని ఒక్కసారిగా ఛిద్రంచేసిన నిర్ణయమది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే అవకాశం వ్యర్థమయిందని వారి బాధ. ఉభయ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా తీవ్రమయ్యేందుకు వారు ఎంతగా ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. పహల్గాం ఊచకోతలకు ప్రతీకారంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య రగుల్కొనే సైనిక ఘర్షణల గురించి ఈ యుద్ధోన్మాదులు అసాధారణ ఊహలు చేశారు. భారత సైనిక దళాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటాయని, బంగ్లాదేశ్‌ను విముక్తం చేసినట్లుగానే బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ శృంఖలాల నుంచి విడిపిస్తాయని వారు ఆశించారు. కానీ, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టాలు వాటిల్లాయని నిరూపించే గట్టి సాక్ష్యాధారాలు ఏవీ ప్రజల దృష్టికి రాలేదు. పైగా పాకిస్థాన్‌ను చావుదెబ్బకొట్టే అవకాశం వచ్చినా కూడా, అంతలోగానే అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయి కాల్పుల విరమణకు అంగీకరించిందనే అభిప్రాయం ప్రజలకు కలిగింది. ప్రధానమంత్రి వ్యవహరించిన తీరుపట్ల అసంతృప్తితో సామాజిక మాధ్యమాలలో ట్వీట్లు వెల్లువెత్తాయి. కాల్పుల విరమణను ప్రకటించిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా కూడా పోకిరీ వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పవిత్ర యుద్ధాన్ని ప్రారంభించాలని సంఖ్యానేకులు డిమాండ్ చేశారు. ఈ ధోరణులకు వ్యతిరేకంగా మే 13 రాత్రి మోదీ చాలా కఠినంగా మాట్లాడినప్పటికీ, ఆయన మాటలు వారి ఆవేశాన్ని తగ్గించలేకపోవచ్చు.

# వ్యూహమేంటి..?

**సొంత కార్యక్రమాలకే కవిత అధిక ప్రాధాన్యత**
**- భారత జాగృతి పేరిట పలు పర్యటనలు**
**- సామాజిక తెలంగాణ కల నెరవేరలేదంటూ వ్యాఖ్యలు**
**- రాజకీయ వర్గాల్లో చర్చోపచర్చలు**



**తెలంగాణవీణ, హైదరాబాద్**
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంత అజెండాతో ముందుకెళుతున్నారా? తన ఇమేజ్‌ను పెంచుకునేందుకు వీలుగా ఆమె వ్యూహాలు పన్నుతున్నారా? అంటే అవుననే అంటున్నాయి గులాబీ పార్టీ వర్గాలు. ఇటీవల కాలంలో ఆమె మరింత దూకుడును ప్రదర్శిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. భారత జాగృతి పేరిట పలు జిల్లాల్లో పర్యటిస్తున్న ఆమె% ఆ పేరుతో సొంత క్యాడర్‌ను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారనే గుసగుసలు వినబడు తున్నాయి. ఇటీవల ఓ కార్యక్రమంలో ప్రసంగించిన ఆమె 'సామాజిక తెలంగాణ కల ఇంకా సాకారం కాలేదు%ొ%' అంటూ వ్యాఖ్యా నించటం గమనార్హం. అయితే తెలంగాణ వచ్చిన 2014 నుంచి పదేండ్ల పాటు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్సే కదా..? అలాంటప్పుడు ఆ పార్టీ ఏలుబడిలో సామాజిక తెలంగాణ రాలేదనే అర్థం స్ఫురించే విధంగా కవిత వ్యాఖ్యలు చేయటమేంటనే సందేహాలు ఇప్పుడు వ్యక్తమవు తున్నాయి. దీన్నిబట్టి ఆమె తన సొంత ఇమేజ్‌ను, బలాన్ని పెంచుకునే పనిలో భాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేశారనే వాదనలు కారు పార్టీలో బలంగా వినబడుతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా కవిత శాసన మండలిలో తన వాణిని బలంగా వినిపిస్తున్నారు. ఒక్కోసారి మండలిలో ఆ పార్టీ నేత మధుసూదనాచారిని మించి కవిత అనేకాంశాలపై గళమెత్తిన సందర్భాలున్నాయి. ఇక మండలి బయట కూడా బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు, అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు తదితర డిమాండ్లపై పలు సంఘాలు, సంస్థలతో ఆమె సదస్సులు, సెమినార్లు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్‌కు భారత జాగృతి తరపున రిపోర్టును సమర్పించారు. ఈ అంశాలన్నింటిపై దాదాపు 47 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కవిత పర్యటించారు.
ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యక్రమాలను తోసిరాజని%ొ% తన సొంత ప్రోగ్రాములతో ఆమె హల్‌చల్ చేయటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే 'కవిత సొంత అజెండా'తో ముందుకెళుతున్నారనే వాదనలు కూడా వినబడుతున్నాయి. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్రంలో కొత్త పార్టీని ఏర్పాటు చేసే సన్నాహాల్లో కవిత ఉన్నారని తెలిసింది. ఈ విషయాన్ని తన తండ్రి కేసీఆర్‌కు కూడా ఆమె ఇప్పటికే తెలిపినట్టు వినికిడి. అయితే ఈ ప్రతిపాదనను ఆయన నిర్ద్వందంగా తిరస్కరించారని సమాచారం. కాగా రాజకీయ కారణాలు.. కేసుల కారణంగానే కవిత ఇలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు 'ఇప్పుడున్న కేసులు, ఒత్తిళ్ల' నేపథ్యంలో ఆమె కొత్త పార్టీ పెట్టకుండా బీజేపీలో చేరొచ్చనే వాదనలు కూడా బలంగా వినబడుతున్నాయి. ఈ విషయంలో ఏం జరగబోతుందో వేచి చూడాలి.

# ఫీజు రియంబర్స్ మెంట్ పై సర్కార్ నిర్లక్ష్యం

**-టీఎస్ఎస్వో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లక్ష్మీనివాస్**
**-రూ.8,000 కోట్లకు చేరిన బకాయిలు**
**-ప్రమాదంలో లక్షల మంది విద్యార్థులకు భవితవ్యం**
**తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి.**



**తెలంగాణవీణ, ఆమనగల్లు,**
: ఫీజు రియంబర్స్ మెంట్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య పూరిత ధరణితో లక్షల మంది పేద విద్యార్థుల భవితవ్యం ప్రమాదంలో పడిందని టీఎస్-ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు రూ.8,000 వేల కోట్లకు పెరిగిపోయిన ఫీజు రియంబర్స్ మెంట్ తక్షణం చెల్లించాలంటూ ఆమనగల్ లో విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఇకపై అన్ని నిర్ణీత కాల పట్టిక ప్రకారం వాయిదాల్లే కుండా చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. రియంబర్స్ మెంట్ బకాయిలతో సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేటు కాలేజీలు, అధ్యాపకులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొందన్న లక్ష్మి నివాస్ గారు వేల సంఖ్యలో కాలేజీలు అప్పులతో మూతపడుతున్నాయని గుర్తు చేశారు.కోర్సులు పూర్తిచేసిన పేద విద్యార్థులు సర్టిఫికెట్లు పొందక ఉద్యోగాలకు దరఖాస్తు చేయలేక ఉన్నత విద్య అభ్యాసించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కాలేజీ యజమాన్యాలకు విద్యార్థులకు మధ్య జరిగిన గొడవలు పోలీస్ స్టేషన్ ల వరకు వెళుతున్న పట్టించుకోరా? అని రాష్ట్ర సర్కార్ ను నిలదించారు. 'ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు ఓటీఎస్ కింద సెటిల్ చేసి ఇకనుంచి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే చెల్లిస్తామని గతంలో జేఎన్టీయూలోను అసెంబ్లీలోను సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు' అని టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నివాస్ గుర్తు చేశారు. తక్షణం ఫీజు బకాయిలు చెల్లించకపోతే తదుపరి పరిణామాలకు ప్రభుత్వానిదే బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, రాష్ట్ర కోఆర్డినేటర్ సుదర్శన్, సోషల్ మీడియా ఇన్చార్జ్ చిక్కి, సందీప్, టీఎస్ఎస్వో ఆమనగల్ మండల కమిటీ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**డిసిసి అధికార ప్రతినిధి - గూడూరు శ్రీనివాస్ రెడ్డి**

**తెలంగాణవీణ, కడ్తాల్,**
కడ్తాల్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో పిడిజి చెన్న కిషన్ రెడ్డి సహకారంతో కొనసాగుతున్న రాగి అంబలి ఉచిత పంపిణీ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధికార ప్రతినిధి గుడూరు శ్రీనివాస్ రెడ్డి తల్లితండ్రులైన కీ.శే గూడూరు పుష్పమ్మ నారాయణ రెడ్డిల జ్ఞాపకార్థంగా పిడిజి చెన్న కిషన్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్ బేగం, ఎంపీడీవో సుజాత, స్థానిక ప్రజాప్రతినిధులతో, నాయకులు, లయన్స్ క్లబ్ మిత్రులతో కలిసి మండల పరిసర ప్రాంత ప్రజలకు ఉచిత రాగిఅంబలి ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ




లయన్స్ క్లబ్ అమనగల్ సేవలు అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా నా యొక్క తల్లితండ్రులైన కీ.శే గూడూరు పుష్పమ్మ నారాయణ రెడ్డిల జ్ఞాపకార్థంగా ప్రజలందరికీ ఉచిత రాగి అంబలి చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా సేవలందించడంలో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉందని అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఒక క్లబ్ మాత్రమే కాదని, సమాజ సేవకు శక్తివంతమైన ఉద్యమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి భీఖ్యా నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మండల పార్టీ అధ్యక్షులు లయన్ బీచ్యా నాయక్, సేవాదల్ అధ్యక్షులు లయన్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లయన్ క్యామ రాజేష్, నాయకులు జాంగిర్ అలీ, మాలే మల్లేష్ గౌడ్, కృష్ణ, బిక్షపతి, మల్లయ్య, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# " శాంతి చర్చలు - మేధో స్పందన"

# అనే అంశంపై రౌండ్ టేబులు సమావేశం..







**తెలంగాణ వీణ/ఓయూ:**
మధ్య భారతదేశంలో ఆదివాసులపై జరుగుతున్న దాడిని వ్యతిరేకిస్తూ, శాంతి చర్చలకు సుముఖంగా ఉన్న విప్లవకారులతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలను జరపాలని ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో " శాంతి చర్చలు - మేధో స్పందన " అనే అంశంపై రౌండ్ టేబులు సమావేశం జరిగింది. సి పి ఐ ( మావోయిస్ట్) పార్టీ తరపు నుండి శాంతి చర్చల కోసం అనేక ప్రకటనలు విడుదల చేసినా కేంద్ర ప్రభుత్వం చర్చలను వ్యతిరేకిస్తున్న సందర్భంలో సమాజంలో మేధావులు ఏ పాత్ర వహించాలి అని మేధావులు, విద్యార్థి సంఘాలు చర్చించారు. రీసెర్చ్ స్కాలర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆజాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల తరపు నుండి ప్రతినిధులు పాల్గొని వాళ్ళ అభిప్రాయాన్ని తెలియజేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ భారతదేశం శాంతిని కోరుకునే దేశం అన్నారు. మావోయిస్టులు చర్చలకు సానుకూలంగా ఉన్నా ప్రభుత్వం ఇంకా స్పందించకపోవడం సరికాదన్నారు. శాంతి చర్చలకు సానుకూల వాతావరణం ఏర్పడడానికి ముందుగా కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటన చేయాలని తెలియజేసారు. ఆపరేషన్ కగార్ లో చనిపోయేవాళ్ళు ఈ దేశ పౌరులు, ఆదివాసులేనన్నారు. ఏ సమస్య అయినా శాంతితో, చర్చలతోనే ముగుస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ రాజ్యాంగ వ్యతిరేకమని, రాజ్యాంగం బద్ధంగా నడుచుకునే ప్రభుత్వాలు దానిని గౌరవించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ అధ్యక్షులు జస్టిస్ చంద్ర కుమార్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, భారత్ బచావో నేషనల్ వైస్ చైర్మన్ ఎం. ఎఫ్. గోపినాథ్, పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ రావు, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, భారత బచావో జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదె ఇన్నయ్య పాల్గొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులుగా ఆదివాసి కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్, సి పి ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ కే . బోస్, సి పి (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ అధికార ప్రతినిధి.జే వీ చలపతిరావు, సి పి (ఎం ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్. ఎల్. పద్మ, సి పి (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ సెంట్రల్ కమిటీ మెంబర్ బొక్కల భాస్కర్, వీ సీ కే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస్, ఏ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు భట్టు వెంకటేశ్వర్లు, ఏ ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు సాగబోయిన పాపారావు, టీ పీ సీ సీ ప్రచార కమిటీ మెంబర్ కోట శ్రీనివాస్, ఓయూ జేఏసీ చైర్మన్ విజయ్, ఉస్మానియా న్యాయ విద్యార్థి సంఘం అధ్యక్షులు శ్రీకాంత్, ఏ ఐ ఎస్ ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, ఎస్ ఎఫ్ ఐ ఉస్మానియా యూనివర్సిటి అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్, అజయ్, పీ డీ ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు అనిల్, పీ డీ ఎస్ యు ( విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి ఆలూరి విజయ్, ఎస్ ఎస్ ఎఫ్ కమిటీ సభ్యులు శివ, డీ ఎస్ ఏ అధ్యక్షులు శ్రవణ్, ఏ ఎస్ ఏ అధ్యక్షులు దివాకర్, గిరిజన శక్తి ఓయు అధ్యక్షులు హనుమంత్ నాయక్, బీ ఆర్ ఎస్ వి నాయకులు రమేష్, జంగయ్య, రాజేష్ నాయక్, టీ ఎస్ డీ ఎస్ ఏ అధ్యక్షులు క్రాంతి కిరణ్, పీ కే ఎం అధ్యక్షులు జాన్, రైతాంగ సమితి అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, సీఆర్పీపీ అధ్యక్షులు పల్లా రవీంద్ర నాథ్, టీపీఎఫ్ రాంబాబు, సామాజిక వేత్త నార్ల రవి, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థుల విజయోత్సవ సంబరాలు







**తెలంగాణ వీణ,కాప్రా:**
కాప్రా విజయ హైస్కూల్ లో పదవ తరగతి విద్యార్థులు ఫలితాల ప్రభంజనం సృష్టించిన్న సందర్భంగా విజయోత్సవ సభను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాచకొండ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఎన్ వెంకటరమణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి తమ అనుభవం, నైపుణ్యం,ప్రతిభను పొందిన తర్వాత విదేశాలకు వెళ్లకుండా భారతదేశంలోనే సేవలందిస్తూ అభివృద్ధిలో భాగస్వాములై ప్రపంచంలో దేశాన్ని ప్రథమస్థానంలో నిలిచేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు 584,581,580 మార్కులు సాధించిన విద్యార్థులు ఈశ్వర్,సత్య ప్రసాద్ సర్వితలకు 5000రూపాయల నగదు పురస్కారాలు,జ్ఞాపికాలతో ఘనంగా సత్కరించారు. 577,576,574,573 మార్కులు సాధించిన విద్యార్థులు టీ. గగన్ తేజ్,ఎం.సంజన, వశీకరన్, ప్రతీక,సంఘమిత్ర,జిశా,రాగిణిపాల్ లకు 2000 రూపాయల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను మిగతా 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులు 90 మందికి శాలువా మెమొంటోలతో యాజమాన్యం ఘనంగా సన్మానించారు.పాఠశాల చైర్మన్ కొప్పునూరి బసప్ప మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో దేశౌన్నత్యాన్ని చాటుతూ దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు.ఇలాంటి ఫలితాలు సాధించడానికి కారకులైన ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరు రాజేశ్వర్,డైరెక్టర్ కొప్పునూరు వీణ,ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయోత్సవ సభను విజయప్రదం చేశారు.

## మే 20న జరగాల్సిన కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా..

**మేడ్చల్ జిల్లా సీఐటీయూ అధ్యక్షులు ఎర్ర అశోక్, కార్యదర్శి జె.చంద్రశేఖర్**





**తెలంగాణవీణ,కాప్రా...**
మే 20న జరగాల్సిన కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె జూలై 9 నాటికి వాయిదా పడిందని మేడ్చల్ జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎర్ర అశోక్, కార్యదర్శి జె. చంద్రశేఖర్ తెలిపారు. దేశంలోని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని న్యూఢిల్లీలో గురువారం జరిగిన కేంద్ర కార్మిక సంఘాల నేతల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా సీఐటీయూ కమలానగర్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులను బలిగొన్న దారుణ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ దాడి అనంతరం దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, మే 20న జరగాల్సిన సమ్మెను జూలై 9కి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, జమ్మూ కాశ్మీర్‌తో పాటు దేశవ్యాప్తంగా శ్రామిక ప్రజలు సమిష్టిగా స్పందించాలని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శ్రామికుల ఐక్యతను ప్రతిబింబించేలా జూలై 9న సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న సంక్షోభ సమయంలో కూడ కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడ్‌ల అమలును బలవంతంగా కొనసాగిస్తున్న తీరు ఆందోళన కలిగించేదిగా ఉందని వారు విమర్శించారు. ఇది కార్మికులు, రైతులు, సాధారణ ప్రజల హక్కులకు వ్యతిరేకంగా ఉందన్నారు. జూలై 9న జరగబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి కార్మికులు, పరిశ్రమల యజమానులు, బాధ్యతాయుత అధికారులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో సమ్మె ఉద్దేశ్యం, లక్ష్యాలపై చైతన్యం పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

## ఏబీవీపీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్ కొనసాగించాలని ప్లేకార్డ్స్ ప్రదర్శన..




**తెలంగాణ వీణ/ఓయూ:**
ఏబీవీపీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఆవరణలో ఆపరేషన్ కగార్ కొనసాగించాలని ప్లేకార్డ్స్ ప్రదర్శన నిర్వహించడం జరిగింది.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్లేకార్డ్స్ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వి తేజ గారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో హింసకు తావుండకూడదనే ఉద్దేశంతో భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ నిర్వహిస్తున్న "ఆపరేషన్ కగార్"ను ఆపాలంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి అలాగే ప్రతిపక్ష నాయకుడు అయినటువంటి మాజీ ముఖ్యమంత్రి కోరడం శోచనీయాంశం అని అన్నారు. అభివృద్ధికి ఆటంకాలు అయినటువంటి నక్సల్ మరియు మావోయిస్టులపై ఎందుకు ఉక్కు పిలికిలి బిగించరాదో చెప్పాలని ప్రశ్నించారు. నక్సలైట్ల యొక్క చరిత్రను తెలియజేస్తూ వారు ముఖ్యంగా వారి యొక్క రక్త దాహాన్ని తీర్చుకోవడం కోసం సామాన్య ప్రజలను వర్గ శత్రువులుగా భావిస్తూ వారి రక్తాన్ని కళ్ళజూడడమే వారి ఉద్దేశం అంటూ వర్గ శత్రువు యొక్క రక్తాన్ని కళ్ళ చూడని వాడు నక్సలైటే కాదనేది వారి నమ్మకం అని ఎండగట్టారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు పెట్టుబడిదారులకు వ్యతిరేకమంటూనే సామాన్య కూలీలు ప్రయాణించే కాకతీయ ఎక్స్ప్రెస్ లోని రెండు భోగిలను తగలబెట్టడం, వారి సిద్ధాంతం నచ్చక వారితో దూరంగా ఉన్నవారిని ఇన్ ఫార్మర్ల నేపంతో, అలాగే ఎంతోమంది పోలీసు అధికారులను పొట్టన పెట్టుకోవడం, ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ఎన్నుకోబడినటువంటి నాయకులను హత్యాగావించటం మావోయిస్టు, నక్సల్స్ మరణకాండకు ప్రతిరూపం అన్నారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినప్పటికీ నోరు మెదపని కొందరు కుహనా మేధావులు సెల్ఫ్ మేడ్ ఇంటలెక్చువల్ చలామణి అవుతున్న అర్బన్ నక్సలైట్లు, పౌర సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు అంటూ నేడు కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ కగార్"ను ఆపాలంటూ శాంతి చర్చలు జరపాలంటూ బహిరంగ సమావేశాల్లో మాట్లాడడం అంటే రాజ్యంగాని కించపరచడమే అంటూ ఆరోపించారు. నక్సల్స్ గా పనిచేసి జనజీవన స్రవంతిలో కలిసి నేడు ప్రజాసేవకులుగా ఎందరో ఎమ్మెల్యే, ఎంపీ, మినిస్టర్ లుగా పని చేస్తున్నారు అని అన్నారు. ఇంటలెక్టువల్స్ ముసుగులో ప్రభుత్వ జీతాలు, పెన్షన్లు తీసుకుంటూనే ప్రభుత్వంపైన తిరుగుబాటు చేసే నక్సల్స్కు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన విద్యాకమిషన్లోని ఉన్నతాధికారులు కూడా నక్సలైట్ల మద్దతుగా మాట్లాడం సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం శోచనీయమైన అంశం అన్నారు. ఈలాంటి నరహంతక నక్సలైట్లను ఏరి పారెయ్యడాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ స్వాగతిస్తుంది అని అన్నారు. "ఆపరేషన్ కగార్"ను కొనసాగించాలని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలి రాజు,వివిధ జిల్లా కన్వీనర్లు బాలు, నాగేష్, అఖిల్, విక్రమాదిత్య మరియు యూనివర్సిటీ అధ్యక్షులు దృహన్ ,విద్యార్థి నాయకులు నరేందర్, రేవంత్ మృత్యుంజయ, ప్రణీత్, భాను, ఆదిత్య, ప్రణయ్, నవీన్, అజయ్, సాగర్, అరవింద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# నీట్, ఐఐటీ బ్రిడ్జ్ కోర్సు పై అవగాహన సదస్సు

**తెలంగాణ వీణ, మేడ్చల్:**
పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు నీట్, ఐఐటీ బ్రిడ్జ్ కోర్స్ లపై అవగాహన సదస్సు లను సద్వినియోగం చేసుకోవాలని కేశవరం లో గల శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జూనియర్ కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు జఠాధరా ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో కేశవరంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జూనియర్ కళాశాలలో నీట్ - ఐఐటీ బ్రిడ్జ్ కోర్సు లపై అవగాహన సదస్సు మే 19 నుండి మే 21 వరకు వివిధ కార్పొరేట్ సంస్థలలో అనుభవం కల ఐఐటి నీట్ ఫాకల్టీ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ , ఐఐటీ తో పాటు వివిధ పోటీ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో ఈ సదస్సు ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని శామీర్ పేట్, మూడుచింతలపల్లి మండల విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7337285228/ 7416145227 కు నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## లక్ష్మీపురం ప్రాంతంలో బస్టాండ్ రోడ్లు పలు అభివృద్ధి పనులకు సహకరిస్తున్న అధికారులకు

### కాంగ్రెస్ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి కందుల సతీష్ ప్రత్యేక కృతజ్ఞతలు



**తెలంగాణ వీణ,పెద్దపెల్లి జిల్లా...**
ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్ ఆదేశాల మేరకు ప్రభావిత ప్రాంతం 14 డివిజన్లోని పలు సమస్యలపై RG 2 జి ఎం గారికి సిఫారసుతో ఆర్జి టు సంబంధించిన అధికారులు 14వ డివిజన్ లక్ష్మి పురం ప్రాంత సమస్యల పరిష్కార పరిశీలనకు వచ్చిన ధనుంజయ్ డిజిఎం సివిల్ మరియు నరేష్ సివిల్ సూపర్వైజర్ అధికారులు 8వ కాలనీ మెయిన్ రోడ్డు మరియు గోదావరిఖని వెళ్లే దారి మధ్యలో లక్ష్మి పురం సంబంధించిన ప్రాంతంలో ఒక బస్ షెల్టర్ మరియు ఎర్రగుంట చెరువు పైన రోడ్డు ఫార్మేషన్ మరియు రోడ్డు నిర్మించాలని మరియు సింగరేణి ఓసిపి వ్యర్ధ నీరు చెరువులోకి మళ్లించాలని మరియు ఈ ప్రాంతంలో బోర్ వెల్స్ ఏర్పాటు చేయాలని అన్నగారు ఆదేశించడం జరిగింది సింగరేణి అధికారులకి ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్ ఈ ప్రాంత ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు కందుల సతీష్ జిల్లా అధికార ప్రతినిధి మాజీ కార్పొరేటర్ చుక్కల శ్రీనివాస్ మహమ్మద్ గౌస్, కుంట సది ,కనకరాజు తిరుమల్, రాజు పాల్గొన్నారు

## నూతన గృహప్రవేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.



**తెలంగాణ వీణ,మహేశ్వరం...**
మహేశ్వరం నియోజకవర్గం బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బంటు రమేష్ ముదిరాజ్ నూతన గృహప్రవేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి సత్యనారాయణ స్వామి వ్రతం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించి బంటు రమేష్ ముదిరాజ్ దంపతులకు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జల్లెల లక్ష్మయ్య పార్టీ నాయకులు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫీజుల మోత వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

### సర్కారు బడి ఉపాధ్యాయుల వినూత్నప్రచారం



**తెలంగాణ వీణ,జగిత్యాల...**
ఇబ్రహీంపట్నం మండలం డబ్బ గ్రామంలో చదువు వ్యాపారం కాదు హక్కు!" అనే స్పష్టమైన సందేశంతో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టారు. "ఫీజుల మోత వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు" అనే నినాదంతో ఊరంతా చైతన్యం నింపుతూ ఇంటింటికీ పాంప్లెట్ పంపిణీ, తల్లిదండ్రులతో ప్రత్యక్ష సంభాషణలు, పాత విద్యార్థుల అనుభవాల వినిపింపజేతతో ప్రైవేటు స్టైల్లో ప్రజా విద్య పరిరక్షణే లక్ష్యంగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన పి.టీ.ఏం సమావేశం పాఠశాల ను మరింత బలపరిచింది. ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ప్రత్యేక కృషి జరిగింది. కార్యదర్శి రవళి, డ్వాక్రా మహిళలు, గ్రామ కుల సంఘాల నాయకులు, పెద్దమనుషులు సహకరించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలున్నాయి ఈ ఏడాది నుంచే నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులు ఇంగ్లీష్ మీడియంలో ప్రారంభమవుతున్నాయి. నాల్గవ, ఐదవ తరగతుల నుండి ఐఐటీ బేసిక్స్ అవగాహన పెంచే బోధనకూ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తనుగుల రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లింగంపెల్లి లక్ష్మి, మాజీ ఎంపీటీసీ శాంతాజీవన్, ఉపాధ్యాయులు అల్లకట్టు సత్యనారాయణ, ఆడెపు నరేష్, హరిప్రసాద్, బొల్లు శంకర్, జనా శంకర్, కోటి శ్రీనివాస్ అంగన్వాడీ టీచర్ గంగామణి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహనా ర్యాలీ..






**తెలంగాణ వీణ,కాప్రా:**
జాతీయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శు క్రవారం కాప్రా కార్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి. కర్నన్ ఆదేశానుసారం డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డి. రమేష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి విచ్చేసి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కాప్రా సర్కిల్ కార్యాలయం నుండి కమలానగర్ మీదిగా ఈసీఐఎల్ చౌరస్తా వరకు ప్లకార్డ్స్ పట్టుకొని నినాదాలు చేస్తూ కాప్రా సర్కిల్ ఆఫీస్ కు చేరుకన్నారు. ర్యాలీ అనంతరం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ఎగ్జిబిషన్ ను కార్పొరేటర్ తిలకించి వివిధ దశల లార్వాను చూసి, ఇన్ సెట్ కలెక్టర్ సేకరించిన లైవ్ ఎడిస్ మస్కిటోను చూసి దోమ యొక్క జీవిత చక్రం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్ తిలకించడానికి విచ్చేసిన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలలో నీటి నిలువలు ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి నిలువెలపై మూతలు ఉంచుకోవాలని, వ్యాధి బారిన పడిన వారు వెంటనే దగ్గరలోని బస్తీ దవఖానాలో ట్రీట్ మెంట్ పొందాలని సూచించారు. కాప్రా అసిస్టెంట్ ఎంటామాలజిస్ట్ డి. రమేష్ మాట్లాడుతూ జాతీయ డెంగ్యూ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. డెంగ్యూ వ్యాధి ఆడ ఎడిస్ దోమ ద్వారా వ్యాప్తి చెందే వైరల్ డిసీస్ అని, ఇది వచ్చినప్పుడు తీవ్ర మైన జ్వరం, తలనొప్పి, కంటి వెనుక భాగంలో నొప్పి, చర్మంపై దద్దుర్లు ఏర్పడుతూ అప్పుడప్పుడు రక్తస్రావం కూడా జరిగే అవకాశం ఉంటుందని వివరించారు. వ్యాధి నివారణ కంటే వ్యాధి రాకుండా చూసుకోవడమే చాలా ముఖ్యమని ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ అని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ విభాగం సానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్, శానిటేషన్ స్టాఫ్ తోపాటు ఎంటమాలజీ సూపర్వైజర్స్,ఎంటమాలజి స్టాఫ్, ఇన్ సెట్ కలెక్టర్స్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా సమస్యలను విస్మరించిన మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్

### -ప్రతి విభాగంలో లంచాలు తీసుకుంటూ పట్టణ అభివృద్ధిని భ్రష్టు పట్టిస్తున్న కమిషనర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి

### -మున్సిపల్ కార్యాలయం ఎదుట బిజెపి నాయకుల ధర్నా



**తెలంగాణ వీణ,మిర్యాలగూడ...**
మిర్యాలగూడ పట్టణంలోని ప్రజా సమస్యల విస్మరిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రజలకు అందుబాటులో ఉండకుండా శానిటేషన్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ ప్రతి విభాగంలో కమిషనర్ విపరీతమైన లంచాలు తీసుకుంటూ పట్టణాన్ని భ్రష్టు పట్టిస్తున్నాడని బిజెపి నాయకులు అన్నారు. ఏదైనా సమస్యను విన్నవించుకుందామంటే ఎప్పుడూ అందుబాటులో ఉండడని పట్టణంలో అక్రమ కట్టడాలు (షెటర్స్) 100 ల సంఖ్యలో పట్టణంలో నిర్మిస్తున్నారని ప్రతి దానికి ఒక రేటు నిర్ణయించి పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాన్నారు. గత మూడు నాలుగు నెలలుగా షానిటేషన్ సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేదని కమిషనర్ కు అనుకూలమైన వారికి మాత్రం వెంటనే జీతాలను చెల్లిస్తున్నారన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో దోమల మందును కొట్టడం లేదన్నారు మరియు సకాలంలో చెత్త బండ్లు కూడా రావడం లేదు అన్నారు. ఇలాంటి చేతకాని అవినీతి కమిషనర్ను వెంటనే సస్పెండ్ చేయాలని బిజెపి నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తం రెడ్డి, బిజెపి వన్ టౌన్ అధ్యక్షులు బంటు గిరి, కార్యదర్శి కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డి, బంటు యాదగిరి, అనిమండ్ల సోములు, ఎడవల్లి నాగరాజు, నక్క రవి, నల్ల రమేష్, మోదాల అశోక్, నక్క శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడి పై కవుల గళం





**తెలంగాణ వీణ...**
ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని వినిపించిన సామూహిక స్వరమే పహల్గాం సంకలనమని, శాంతి కోసం ఆకాంక్షించే హృదయ స్పందనల ప్రతిరూపమే ఈ సంకలనమని హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు.వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన పహల్గాం ఉగ్రదాడి పై శతాధిక కవుల గళం మరియు హాస్య వల్లరి తో పాటు బాల సాహితీవేత్త గద్వాల సోమన్న రచించిన సప్తతి పుస్తకాలను హైదరాబాద్ లోని రవీంద్రభారతి మొదటి అంతస్థులోని సమావేశ మందిరంలో మే 16, శు క్రవారం రోజున తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ,భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తిని ప్రతిధ్వనించే భారతీయుల ఆకాంక్షల ప్రతిఫలనంగా పహల్గాం కవితా సంకలనం రూపొందినదని, భారతీయులందరూ ఉగ్రవాదాన్ని ఖండించాలని అన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన చౌడూరి నరసింహారావు హాస్యవల్లరిని సమీక్షించగా తెలుగు విశ్వవిద్యాలయం విజిటింగ్ ప్రొఫెసర్ ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు పహల్గాం పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఉగ్రదాడి పై శతాధిక కవుల గళాన్ని గ్రంథస్తం చేసిన ప్రభాకర్ ని అభినందించారు. కవుల ప్రతిస్పందనలను ప్రశంసించారు. కార్యక్రమంలో చిరంజీవి పొర్ల అవంతిక, వంగరి అపూర్వలు చక్కని నృత్యాన్ని ప్రదర్శించారు. గంప ఉమాపతి ఆహ్వానించిన కార్యక్రమంలో విశ్వంభర పత్రికా సంపాదకులు మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని అన్నారు.కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి డా.నామోజు బాలాచారి,గద్వాల సోమన్న, రామకృష్ణ చంద్రమౌళి,గజవెల్ళి సత్యనారాయణ స్వామి,వెల్మల జయపాల్ రెడ్డి,ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎనభైమంది కవులు పాల్గొన్నారు.

# బిజినెస్

## రూ.10 వేలకే యాక్టివా ఈ-స్కూటర్.. అదిరే ఆఫర్ ప్రకటించిన హెూండా



**తెలంగాణవీణ, బిజినెస్**

యాక్టివా-ఈ ఈవీ స్కూటర్ అధునాతన ఫీచర్లతో రూపొందించారు. పట్టణ ప్రాంత ప్రయాణాలకు మంచి శ్రేణిని అందించే ఈ స్కూటర్ దేశీయ మార్కెట్లో దీని ధర రూ.1.17 లక్షలు (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ)గా ఉంది. అయితే ఈ స్కూటర్‌ను కేవలం రూ.10 వేల డౌన్ పేమెంట్ చెల్లించడం ద్వారా కస్టమర్లు హెూండా యాక్టివా -ఈ అఫర్డబుల్ స్కూటర్‌ను పొందవచ్చని హెూండా కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. హెూండా యాక్టివా ఈ ఆన్ రోడ్ ధర ఢిల్లీలో దాదాపు రూ.1.46 లక్షలుగా ఉంది. ఇందులో ఎక్స్-షోరూమ్ ధరతో పాటు ఆర్‌టీఓ ఛార్జీలు, బీమా మొత్తం కూడా ఉన్నాయి. అయితే ఇప్పుడు హెూండా యాక్టివా-ఈ కొనడానికి డౌన్ పేమెంట్‌గా రూ. 10,000 డిపాజిట్ చేస్తే మిగిలిన రూ. 1.36 లక్షలను బ్యాంకు నుంచి రుణం మంజూరు చేస్తారు. మీ క్రెడిట్ రికార్డ్‌తో పాటు సిబిల్ స్కోరు బాగుంటే మీరు బ్యాంకు నుండి 9 శాతం వార్షిక వడ్డీ రేటుకు రుణం పొందవచ్చు. నెలకు రూ.4 వేల ఈఎంఐ పేమెంట్‌తో మీరు 36 నెలలు కట్టాల్సి ఉంటుంది. అంటే మీరు దాదాపు రూ. 20 వేలు వడ్డీగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే మీరు ఢిల్లీలో ఈవీ కొనుగోలుపై ప్రభుత్వం అందించే వివిధ సబ్సిడీల కింద డిస్కౌంట్లను కూడా పొందవచ్చు. హెూండా యాక్టివా ఎలక్ట్రిక్ స్కూటర్ 1.5 కేడబ్ల్యూ రెండు రిమూవబుల్ లిథియం-అయాన్ బ్యాటరీలతో వస్తుంది. కాబట్టి మొత్తం 3 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యాన్ని అందిస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 102 కి.మీ వరకు ప్రయాణించవచ్చని కంపెనీ పేర్కొంది. యాక్టివా-ఈ ప్రామాణిక హెూమ్ ఛార్జర్‌తో 4-5 గంటల్లో ఛార్జ్ అవుతుంది. దీంతో పాటు హెూండా యాక్టివా ఎలక్ట్రిక్ కోసం ఎక్స్ఛేంజ్ బ్యాటరీ సౌకర్యాన్ని కూడా అందిస్తుంది. హెూండా యాక్టివా ఎలక్ట్రిక్ గరిష్ట వేగం గంటకు 80 కి.మీ. ఇందులో ఎకాన్, స్టాండర్డ్, స్పోర్ట్స్ వంటి మూడు రైడింగ్ మోడ్‌లు కూడా ఉన్నాయి.

## సూపర్ ఫీచర్స్‌తో బుల్లెట్ బండి ఈవీ వెర్షన్.. విడుదల ఎప్పుడంటే..?

**తెలంగాణవీణ, బిజినెస్**

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈవీ బైక్ 2026 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో విడుదల చేస్తామని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సీ-6 పేరుతో పరిచయం చేయనున్నారు. కొత్త ఈవీ బ్రాండ్‌కు సంబంధించిన కార్యకలాపాలు, డీలర్‌షిప్ నెట్‌వర్క్‌పై బ్రాండ్ ఇంకా కొంత స్పష్టత ఇవ్వలేదు. ఫ్లయింగ్ ఫ్లీ సీ6 ఈఐసీఎంఏలో మొదటిసారి కనిపించింది. అప్పటి నుంచి ఈ టెస్ట్ మ్యూల్ వివిధ సందర్భాల్లో ట్రయల్స్‌లో కనిపిస్తుంది. ఈ ట్రాయల్స్‌లో బ్రాండ్‌కు సంబంధించిన రెట్రో, లెటెస్ట్ లుక్స్‌ను ప్రతిబింబించేలా ఎల్ఈడీ లైటింగ్ సిస్టమ్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఈ మోటర్ సైకిల్ అల్యూమినియం ఛాసిస్, గిర్డర్ ఫోర్క్‌లతో సన్నని ఫ్రేమ్‌తో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఈ బైక్ వింటేజ్ బైక్‌లను గుర్తుకు తెస్తుంది. అదనంగా స్ప్లిట్ సీట్ కాన్ఫిగరేషన్, బ్లాక్ అల్లాయ్ వీల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్లయింగ్ సీ-6 స్ట్రీమ్‌లైన్డ్ బాడీ గాలి ప్రవాహాన్ని నియంత్రించే



మెగ్నీషియం కేసింగ్‌తో ఉంటుంది. అయితే ఈ బైక్ స్పెసిఫికేషన్లు అధికారికంగా ఇంకా వెల్లడించలేదు. అయితే ముఖ్యంగా ఈ ఈవీ బైక్ పట్టణ ప్రాంత అవసరాలకు అనుగుణంగా రూపొందించారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈవీ సుమారు 100 కి.మీ పరిధిని ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రోజువారీ ప్రయాణాలకు అనుగుణంగా ఈ బైక్‌ను రూపొందించారు. అలాగే బరువు కూడా కేవలం 100 కిలోలు ఉండేలా డిజైన్ చేశారు. ముఖ్యంగా లుక్స్ పరంగా ఈ బైక్ యువతను అమితంగా ఆకట్టుకునేలా డిజైన్ చేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఉత్పత్తి శ్రేణి అధునాతన ఫీచర్లతో కూడిన మొదటి మోటార్‌సైకిల్‌గా దీనిని పరిగణించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అలాగే ఈ బైక్ వాయిస్ కంట్రోల్, కనెక్టివిటీ, మరిన్ని వంటి అనేక విధులను సులభతరం చేసే రౌండ్ టచ్‌స్క్రీన్ డిస్‌ప్లేతో వస్తుంది. అలాగే ఈ టచ్ స్క్రీన్ పని చేయడానికి రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్‌తో వస్తుంది. ఈ ఆవిష్కరణ సందర్భంగా రాయల్ ఎన్‌ఫీల్డ్‌లోని ఎలక్ట్రిక్ వాహనాల చీఫ్ గ్రోత్ ఆఫీసర్ మారియో అల్విసి మాట్లాడుతూ ఈ మోటార్‌సైకిల్ అత్యంత అత్యాధునిక లక్షణాలతో యువతను ఆకర్షిస్తుందని స్పష్టం చేశారు.

## కెనడా సంస్థతో ప్యూర్ జట్టు..

**తెలంగాణవీణ, బిజినెస్**

తెలంగాణకు చెందిన బ్యాటరీ టెక్నాలజీ, పవర్ ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రముఖమైన ప్యూర్ సంస్థ, కెనడాకు చెందిన ఛార్జ్ పవర్ ఇంక్‌తో ఒక ముఖ్యమైన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా ప్యూర్ తన ఎనర్జీ స్టోరేజ్ ఉత్పత్తులను అమెరికా, కెనడా మార్కెట్లలోకి విడుదల చేయనుంది. ప్యూర్ తన 'ప్యూర్ పవర్' శ్రేణి ఉత్పత్తులను ఇకపై అమెరికా, కెనడా దేశాలకు ఎగుమతి చేయనుంది. అమెరికా మార్కెట్‌లో ప్రధానంగా గ్రిడ్ స్థాయి ఉత్పత్తులపై దృష్టి కేంద్రీకరించనుండగా, కెనడాలో కమర్షియల్, ఇండస్ట్రియల్ మరియు గ్రిడ్ స్థాయి అప్లికేషన్‌లపై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ సహకారంతో ప్యూర్ అధునాతన ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్‌లు కెనడా,




అమెరికాలోని వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. రెండు సంస్థలు కలిసి తమ బ్రాండ్‌లను ప్రోత్సహించనున్నాయి. ప్యూర్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నిశాంత్ దొంగరి మాట్లాడుతూ... ప్యూర్ పవర్ అనేది ఎనిమిది సంవత్సరాల నిరంతర కృషి ఫలితమన్నారు. ఇప్పటికే గృహ, వాణిజ్య, భారీ పరిశ్రమల్లో అనేక ఉత్పత్తులు విజయవంతంగా పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. బ్యాటరీ టెక్నాలజీ, పవర్ ఎలక్ట్రానిక్స్‌లో తమకున్న లోతైన అనుభవం, బలమైన ఉత్పత్తి సామర్థ్యాలతో తమ వినూత్నమైన, మన్నికైన, నమ్మకమైన ఎనర్జీ స్టోరేజ్ ఉత్పత్తులు అమెరికా, కెనడా మార్కెట్లలో విస్తృతమైన ఆదరణ పొందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నార్త్ అమెరికాలో 4 గిగావాట్లకు పైగా ప్రాజెక్టులను పూర్తి చేసిన అనుభవం, ఈపీసీ, మార్కెటింగ్, సేల్స్‌లో బలమైన నైపుణ్యం కలిగిన ఛార్జ్ పవర్‌తో భాగస్వామ్యం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇరు సంస్థల బలాలు, సామర్థ్యాలను ఉపయోగించి రాబోయే నెలల్లో ఈ మార్కెట్లలో గణనీయమైన ప్రభావాన్ని చూపుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మార్కెట్లు తమ ప్రపంచ విస్తరణ వ్యూహంలో కీలకమైన భాగమని ఆయన పేర్కొన్నారు.

## అవును.. నాతో మాట్లాడాకే వీడ్కోలు పలికాడు..!

**తెలంగాణవీణ, క్రీడలు :**


ఇంగ్లండ్ సిరీస్‌కు ముందే విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలకడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 10 వేల పరుగుల మైలురాయికి చేరువలో ఉన్న విరాట్.. హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటిస్తాడని ఎవరూ ఊహించి ఉండరు. కానీ, భారత జట్టు మాజీ కోచ్ రవిశాస్త్రి కి మాత్రం ఈ విషయం ముందే తెలుసట. ఇదే అంశంపై శాస్త్రిని ప్రశ్నిస్తే.. అవును నాకు ముందే తెలుసు. నాతో మాట్లాడిన తర్వాతే కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు అని వెల్లడించాడు. టీమిండియా కోచ్‌గా చెరగని ముద్ర వేసిన రవిశాస్త్రికి కోహ్లీతో మంచి అనుబంధం ఉంది. శాస్త్రి హయాంలోనే విరాట్ కెప్టెన్‌గా జట్టును నంబర్ 1గా నిలిపాడు. కోచ్, సారథిగా కంటే.. స్నేహితుల్లా పలు విషయాలు చర్చించుకునేవాళ్లు ఇద్దరూ. కాబట్టే విరాట్ టెస్టులకు అల్విదా పలకడానికి ముందు రవిశాస్త్రితో మాట్లాడాడు. 'అవును.. రిటైర్మెంట్



ప్రకటను వారం రోజుల ముందు కోహ్లీ నాతో మాట్లాడాడు. సుదీర్ఘ ఫార్మాట్‌కు తాను చేయగలిగినంతా చేశానని.. ఇకపై వీడ్కోలు చెప్పడమే మిగిలిందని అన్నాడు' అని శాస్త్రి గుర్తు చేసుకున్నాడు. ఇష్టమైన టెస్టులకు గుడ్ బై చెబుతున్నందుకు ఏమైనా బాధగా ఉందా?' అని నేను కోహ్లీని అడిగాను. అందుకు అతడు అదేమీ లేదని చెప్పాడు. అయినా సరే నేను ఒకటి రెండు ప్రశ్నలు వేశాను. అందుకు అతడు.. తాను స్పష్టంగా ఉన్నానని.. తన మనసులో ఎలాంటి సందేహాలు లేవని బదులిచ్చాడు. సో.. అప్పుడే నాకు అతడి వీడ్కోలుకు సరైన సమయం వచ్చిందని అనిపించింది. మామూలుగా ఏ క్రికెటర్ అయినా బ్యాటింగ్ చేశామా తమ పని అయిపోయిందిలే అనుకుంటారు. కానీ కోహ్లీ అలాకాదు. మైదానంలో చిరుతులా కదులుతాడు. అన్ని వికెట్లు తానే తీయాలని.. అన్ని క్యాచ్‌లు తానే పట్టాలని ఆరాటపరుతాడు. ప్రత్యర్థుల కవ్వింపులకు అంతే స్థాయిలో బదులిస్తూ.. ఫ్యాన్స్‌ను అలరిస్తాడు. అందుకే.. అతడి ఆట చూసేందుకు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ప్రజలు స్టేడియాల్లో వాలిపోయేవారు. అంతటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న కోహ్లీ.. మరో రెండు మూడేళ్లు టెస్టులు ఆడుతాడని అనుకున్నా. కానీ, వీడ్కోలుతో నన్ను ఎంతో ఆశ్చర్యపరిచాడు' అని మాజీ కోచ్ చెప్పుకొచ్చాడు.

## ప్లే ఆఫ్స్‌కు దూరమైనా..రికార్డులు మాత్రం సన్‌రైజర్స్‌వే..!

**తెలంగాణవీణ, క్రీడలు** ఐపీఎల్ అంటేనే పవర్ హిట్టర్లు, పరుగులు వరదకు కేరాఫ్. అలాంటి ఈ పొట్టి క్రికెట్ లీగ్‌లో రికార్డుబ్రేకర్స్ చాలామందే. కానీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మాత్రం ప్రత్యేకం అని చెప్పాలి. నిరుడు అత్యధిక స్కోర్‌తో రికార్డులు బద్ధలు కొట్టిన ఆరెంజ్ ఆర్మీ.. ఈసారి కూడా తగ్గేదేలే అంటూ తొలి పోరులోనే 286 పరుగులు చేసింది. అయితే.. ఈ ఎడిషన్‌లో హైదరాబాద్ జట్టు ప్లే ఆఫ్స్ రేసులో లేదు. కానీ, ఓపెనర్ల విధ్వంసంతో అత్యధిక పరుగుల భాగస్వామ్యం నమోదు చేసింది కమిన్స్ సేన.పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ సెంచరీతో గర్జించగా.. ట్రావిస్ హెడ్ బౌండరీలతో మోత మోగించాడు. దాంతో, 18వ ఎడిషన్‌లో అత్యధిక పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారిద్దరు. ఉప్పల్ మైదానంలో పంజాబ్ బౌలర్లను ఊచకోత కోసిన ఈ చిచ్చరపిడుగులు 75 బంతుల్లోనే 171 రన్స్ పిండుకున్నారు. ఇప్పటివరకూ జరిగిన లీగ్ దశలో ఇదే రికార్డు పార్ట్‌నర్‌షిప్ కావడం విశేషం. రెండో స్థానంలో



రాజస్థాన్ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వీ జైస్వాల్ జోడీ ఉంది.

విధ్వంసక బ్యాటింగ్‌తో వైభవ్ 35 బంతుల్లోనే శతకం సాధించగా.. గుజరాత్ బౌలర్లను చితక్కొడుతూ యశస్వీ అర్థ శతకంతో రెచ్చిపోయాడు. దాంతో ఈ ద్వయం తొలి వికెట్‌కు 166 పరుగులు జోడించింది. పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు మూడో స్థానంలో నిలిచారు. పవర్ ప్లేలో కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లపై విరుచుకుపడిన ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్‌లు 120 రన్స్‌తో శుభారంభం ఇచ్చారు. ఈ సీజన్‌లో టాప్ గేర్‌లో ఆడుతున్న గుజారాట్ టైటాన్స్ ఓపెనర్లు సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ కూడా 120 పరుగులు చేయగా.. కరుణ్ నాయర్, అభిషేక్ పొరెల్(ఢిల్లీ క్యాపిటల్స్) 119 పరుగులతో టాప్ 5లో చోటు సంపాదించారు.

**ఆరెంజ్, పర్పుల్ క్యాప్**

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులో సూర్యకుమార్ యాదవ్ అందరికంటే ముందున్నాడు. వరుసగా 11 మ్యాచుల్లో 25 ప్లస్ స్కోర్ చేసిన అతడి ఖాతాలో 510 పరుగులు ఉన్నాయి. అతడి వెనకాలే గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్(509), కెప్టెన్ శుభ్‌మన్ గిల్(508) వరుసగా రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నారు. గుజరాత్ పేసర్ ప్రసిధ్ కృష్ణ పర్పుల్ క్యాప్ ఒడిసిపట్టేయనున్నాడు. ఈ పొడగరి పేసర్ లీగ్ దశలో వికెట్లు పడగొట్టాడు. సీఎస్కే స్పిన్నర్ నూర్ అహ్మద్ కూడా 20 వికెట్లు తీశాడు. కానీ, రెండు లీగ్ మ్యాచుల్లో అతడు ప్రసిధ్‌ను అధిగమించినా.. ప్లే ఆఫ్స్ ఆడదు. సో.. 18 వికెట్లతో మూడో స్థానంలో ఉన్న ఆర్సీబీ స్టార్ పేసర్ హేజిల్‌వుడ్ పోటీనిచ్చే అవకాశముంది.

# స్పోర్ట్స్

## ఐపీఎల్ ఛాన్స్ మిస్.. కౌంటీల్లో ఇంగ్లండ్ వెటరన్..!



**తెలంగాణవీణ, క్రీడలు :**

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆడే అవకాశం కోల్పోయిన ఇంగ్లండ్ వెటరన్ జేమ్స్ అండర్సన్ మళ్లీ మైదానంలోకి దిగనున్నాడు. కౌంటీల్లో ఆడేందుకు అంగీకరించిన అండర్సన్ ల్యాంక్‌షైర్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. వీడ్కోలు తర్వాత అతడు ఆడబోతున్న తొలి మ్యాచ్ ఇదే. దాంతో, మరోసారి ఈ లెజెండరీ పేసర్ బౌలింగ్ చూసేందుకు అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న ల్యాంక్‌షైర్ 42 ఏళ్ల అండర్సన్‌పై భారీ అంచనాలే పెట్టుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో మేటి ఆటగాళ్లను తన స్వింగ్‌తో బెంబేలెత్తించిన ఈ మాజీ పేసర్.. ఇప్పుడు కౌంటీల్లో చెలరేగిపోయేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. కౌంటీ ఛాంపియన్‌షిప్ డివిజన్ 2 మ్యాచ్ కోసం అండర్సన్‌ను తీసుకుంది ల్యాంక్‌షైర్. ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో మే 16, శుక్రవారం డెర్బిషైర్ జట్టుతో జరిగే మ్యాచ్‌లో జిమ్మీ బరిలోకి దిగనున్నాడు. నిరుడు జూలైలో రిటైర్మెంట్ ప్రకటించిన అండర్సన్.. ఆ తర్వాత ఇంగ్లండ్ పురుషుల జట్టు బౌలింగ్ కన్సల్టంట్‌గా సేవలందించాడు.తన సుదీర్ఘ కెరియర్‌లో 188 టెస్టులు ఆడిన ఈ పేసర్.. 704 వికెట్లతో చరిత్ర సృష్టించాడు. మూడుసార్లు 10 వికెట్లు.. 32 పర్యాయాలు ఐదు వికెట్ల ప్రదర్శనతో ఔరా అనపించాడీ పేస్ గన్. వయసు పెరుగుతున్నా కొద్దీ రాటుదేలిన అండర్సన్.. లార్డ్స్‌లో అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఇక్కడ ఆడిన 29 టెస్టుల్లో 123 వికెట్లు పడగొట్టాడు. రిటైర్మెంట్ తర్వాత జిమ్మీ ఐపీఎల్ 18వ సీజన్ మెగా వేలంలో పాల్గొన్నాడు. రూ.2 కోట్ల కనీస ధరకు పేరు నమోదు చేసుకున్న ఈ పేస్ దిగ్గజంను ఏ ఫ్రాంచైజీ కొనేందుకు ఆసక్తి చూపలేదు.

**ల్యాంక్‌షైర్ స్క్వాడ్ :** మార్కస్ హ్యారిస్(కెప్టెన్), జేమ్స్ అండర్సన్, టామ్ బెయిలీ, జార్జ్ బాల్డర్సన్, జార్జ్ బెల్, జోష్ బొహన్నన్, టామ్ హర్ట్లే, మ్యాటీ హర్ట్స్, కీటన్ జెన్నింగ్స్, మైఖేల్ జోన్స్, అండర్సన్ ఫిలిప్, ఓలీ సట్టన్, ల్యూక్ వెల్లస్, విల్ విలియమ్స్.



# పెద్దిలో పూజ స్పెషల్ సాంగ్ ??

## - ఇక జిల్ జిల్ జిగేలే అంటున్న ఫ్యాన్స్

**తెలంగాణవీణ, సినిమా :**
రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతోన్న పెద్ది సినిమాలో మాస్ మసాలా సాంగ్ ప్లాన్ చేస్తున్నారు దర్శకుడు బుచ్చిబాబు. ఈ సాంగ్ కోసం లేటెస్ట్ గా పూజా హెగ్డే పేరు వినిపిస్తోంది. చెర్రీ రంగస్థలంలో స్పెషల్ సాంగ్ చేశారు పూజా హెగ్డే.రంగస్థలం సినిమాలో జిగేల్ రాణి సాంగ్‌నీ, ఆ సాంగ్ సిట్యువేషన్‌నీ అంత తేలిగ్గా మర్చిపోలేరు జనాలు. రామ్‌చరణ్, పూజా హెగ్డే.. జస్ట్, జిగేల్ రాణి సాంగ్‌లోనే కాదు, ఆ తర్వాత ఆచార్య లోనూ కలిసి కనిపించారు.ఆచార్య మూవీ రిజల్ట్ ఎలా ఉన్నా.. నీలాంబరి సాంగ్ మాత్రం ఇప్పటికీ జనాలకు గుర్తుండిపోయింది. సో, పెద్దిలో వీరి కాంబో అనగానే ప్రేక్షకుల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. ఇప్పుడంటే పూజా పేరు వినిపిస్తోంది గానీ, పెద్ది మూవీలో స్పెషల్ సాంగ్‌కి ఫస్ట్ వినిపించిన పేరు శ్రీలీల. కిస్సిక్ బ్యూటీతో స్పెషల్ సాంగ్ చేయించడానికి అంతా రెడీ అనే మాటలు వినిపించాయి.శ్రీలీల పేరుతో పాటు సైమల్‌టైనియస్‌గా ట్రెండ్ అయింది సమంత హ్యాష్‌ట్యాగ్. రంగస్థలంలో హీరోయిన్‌గా నటించిన సామ్.. పెద్దిలో స్పెషల్ సాంగ్ చేస్తే బావుంటుందనే అభిప్రాయాలు వినిపించాయి. మేకర్స్ అఫిషియల్‌గా అనౌన్స్ చేసే వరకు.. ఇలాంటి పేర్లు ఇంకెన్ని వినాల్సి వస్తుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు నెటిజన్స్.




# ఓటీటీలోకి వచ్చేసిన ప్రభుదేవా "జాలీ ఓ జింఖానా"

**తెలంగాణవీణ, సినిమా :**
ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా ప్రధాన పాత్రలో నటించిన "జాలీ ఓ జింఖానా" సినిమా ఓటీటీలోకి వచ్చేసింది. ఈ సినిమా ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. అయితే ఈ సినిమాను భవానీ మీడియా ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు ఆహాలో తీసుకువచ్చింది చిత్రయూనిట్. గతేడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాని దర్శకుడు శక్తి చిదంబరం తెరకెక్కించారు. ఈ సినిమాని ప్రభుదేవా తన సొంత నిర్మాణ సంస్థ అయిన ప్రభుదేవా స్టూడియోస్‌లో నిర్మించారు. "జాలీ ఓ జింఖానా" సినిమాలో ప్రభుదేవాతో పాటు రెజీనా, పూజా కుమార్, యోగిబాబు, రోబో శంకర్, మడోన్నా సెబాస్టియన్, పూజిత పొన్నాడ, అభిరామి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాకి సంగీతం జస్టిన్ ప్రభాకరన్ అందించారు.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తంగసామి అనే వ్యక్తి తన కూతురు చెల్లమ్మ (అభిరామి), మనవరాళ్లు భవానీ, యజాని, శివానీ (మడోన్నా సెబాస్టియన్)తో కలిసి ఒక బిర్యానీ సెంటర్‌ను నడుపుతుంటాడు. అనుకోకుండా స్థానిక ఎమ్మెల్యేతో చెల్లమ్మకు గొడవ జరుగుతుంది. ఆ ఎమ్మెల్యే మనుషులు తంగసామిని కొట్టడంతో అతను ఆసుపత్రి పాలవుతాడు. ఎమ్మెల్యేపై చట్టపరంగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్న చెల్లమ్మ, ఆమె కుమార్తెలు ఒక లాయర్‌ను (ప్రభుదేవా) కలుస్తారు. అలా ఉండగా, అనుకోకుండా భవానీ, శివానీ మరియు వారి కుటుంబం ఒక హత్య చేస్తారు. ఈ కేసు నుండి బయటపడటానికి వారు శవాన్ని ఒక బతికున్న వ్యక్తిగా నమ్మిస్తారు. అసలు వారు హత్య చేసింది ఎవరిని? బ్యాంకును మోసం చేసి పది కోట్లు ఎలా దోచుకున్నారు? అనేదే ఈ సినిమా కథ.

# రామాయణ'లో కాజల్ అగర్వాల్



**తెలంగాణవీణ, సినిమా :**
టాలీవుడ్, బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే చాలా రోజుల తర్వాత సత్యభామ అంటూ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకుంది. అయితే ఈ భామ తాజాగా మరో బంఫరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం రామాయణలో కాజల్ ఛాన్స్ కొట్టేసినట్లు తెలుస్తుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమాలో కాజల్ రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనున్నారు.నితీష్ తివారి 'రామాయణ' ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచి నటీనటుల ఎంపికపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఖరారయ్యారు. ఇప్పుడు మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేసినట్లు వార్తలు వస్తున్నాయి. కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. ఆమె నటనకు మంచి గుర్తింపు ఉంది. 'మగధీర', 'డార్లింగ్', 'బృందావనం' వంటి తెలుగు చిత్రాలతో పాటు, 'సింగం', 'స్పెషల్ 26' వంటి హిందీ చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటుకున్నారు. ఇప్పుడు 'రామాయణం' వంటి ప్రతిష్టాత్మక చిత్రంలో మండోదరి వంటి బలమైన పాత్రలో ఆమె ఎలా మెప్పిస్తారో చూడాలి. మండోదరి పాత్ర రామాయణంలో ఒక ముఖ్యమైన పాత్ర. ఆమె రావణుడికి మంచి సలహాలు ఇస్తూ, ధర్మం వైపు నిలబడే ప్రయత్నం చేస్తుంది. తన భర్త తప్పులను ఎత్తిచూపుతూ, సీతను తిరిగి రాముడికి అప్పగించాలని సూచిస్తుంది. కాబట్టి, ఈ పాత్రకు కాజల్ వంటి అనుభవం ఉన్న నటి అయితే మరింత న్యాయం చేకూరుస్తుందని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, కాజల్ అగర్వాల్ కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు. నితీష్ తివారి 'రామాయణం' మూడు భాగాలుగా తెరకెక్కనున్నట్లు సమాచారం. ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతికతతో ఈ చిత్రం రూపొందనుంది.




# విడుదల తేదీ ప్రకటించిన పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు'

**తెలంగాణవీణ, సినిమా :**
ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రాలలో హరిహర వీరమల్లు ఒకటి. పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకు రూల్స్ రంజన్ దర్శకుడు జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ఈ మూవీని జున్ 12 ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మేకర్స్. జూన్ 12న పవన్ కళ్యాణ్ మాస్ విశ్వరుపం చూడడానికి సిద్ధంగా ఉండడంటూ చిత్రబృందం ప్రకటించింది.ం

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written